

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

## కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

గురువారం 10 అక్టోబర్ 2024 11 పేజీలు



పాఠకులకు
మిత్రులకు
శ్రేయోభిలాషులకు

సద్దుల బతుకమ్మ
శుభాకాంక్షలు



సూర్య దినపత్రిక
కరీంనగర్ యూనిట్ కార్యాలయం
గ్రా. రామకృష్ణ కాలనీ
మం. తిమ్మాపూర్


# ఆ హాస్పిటల్‌లో అడ్డగోలు
# బిల్లుల మోత






- "చెవి"లో బిల్లు చెప్పి "ముక్కు" పిండి వసూల్లు
- బిల్లు దెబ్బకు రోగుల "గొంతు"లో నుండి అబ్బా అనాల్సిందే
- మార్కెటింగ్ మాయాజాలంలో రోగులే పావులు
- ఆర్ఎంపీలకు బిల్లుల్లో వాటాలు ఆపై నజరానాలు

**సూర్య జగిత్యాల**

జగిత్యాల పట్టణంలో పాత బస్టాండ్ సమీపంలోని ఓ ప్రముఖ స్పెషలిస్ట్ హాస్పిటల్ లో కార్పొరేట్ స్థాయిలో బిల్లుల వసూల్లు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. హాస్పిటల్ యజమాని అయిన వైద్యునికి తెలిసి గోరంత, తెలియకుండా కొండంత బిల్లుల వసూల్లు జరుగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి

2లో

## పువ్వులను పూజించే పండగ
# బతుకమ్మ పండుగ..
# నేడు సద్దుల బతుకమ్మ

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ఎప్పుడెప్పుడు అనే ఎదురుచూసే సద్దుల బతుకమ్మ పండగ.. రానే వచ్చింది. ఈ బతుకమ్మ పండుగ అనేది ఆడపడుచులు అందరికీ ఎంతో ఇష్టమైన పండుగ... చిన్న పెద్ద అనే తేడా లేకుండా మహిళలందరూ ప్రకృతిలో దొరికే సహజసిద్ధమైన పుష్పాలను తీసుకువచ్చి ఎంతో ఇష్టంగా పెద్ద బతుకమ్మను పేర్చి.. ఊరు వాడల్లో మహిళలందరూ భక్తి భావంతో బతుకమ్మ పాటలు పాడుతూ.. సందడి చేస్తూ మనకు దర్శనమిస్తున్నారు.



# శ్రీ సరస్వతి దేవిగా (కాళరాత్రి) అమ్మవారు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

మహాశక్తి ఆలయంలో శ్రీదేవి శరన్నవ రాత్రుల సందర్భంగా ఏడవ రోజు దుర్గా మాత అమ్మవారు శ్రీ సరస్వతి దేవిగా (కాళరాత్రి) దీపాలు, పూల అలంకరణతో అమ్మవారు.



## ప్రజా ఆరోగ్యాన్ని గాలికి
# వదిలేసిన అధికారులు

- శుచికరమైన, నాణ్యమైన మాంసం విక్రయిస్తున్నారా.!?
- కుళ్ళిన మాంసాన్ని ఫ్రెష్‌గా ఎలా మారుస్తున్నారు?
- స్లాటర్ హౌస్‌ను వినియోగంలోకి తెస్తే ఎవరికి నష్టం!
- మాంసం ప్రియులు జర భద్రం

2లో

**సూర్య-గోదావరిఖని**












# ఆ హాస్పిటల్‌లో అడ్డగోలు బిల్లులు మోత

**సూర్య జగిత్యాల**

ఈ నేపథ్యంలో ఆ వైద్యుని వద్ద పనిచేసే సిబ్బందిలో ఒకరిద్దరు వైద్యుని వెన్నుపోటు పొడిచి కోట్లు గడించి స్థిరాస్తి రూపంలో భద్రపరుచుకున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రికి వచ్చే రోగికి చికిత్స చేయడం ఒక్కటే వైద్యుని పని, మిగతా అంతా ఆసుపత్రి సిబ్బందిలో కొందరు తమ "స్వంత" పనిలా చూసుకుంటారని, ఈ క్రమంలో రోగి "చెవి"లో బిల్లు చెప్పి "ముక్కు" పిండి వసూలు చేస్తుంటే రోగి "గొంతు"లో నుండి అబ్బా అనే శబ్దం వస్తుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో ప్రముఖ స్పెషలిస్ట్ గా సుమారు 20 సంవత్సరాల నుండి సేవలందిస్తుండగా స్వచ్ఛందంగా ఎవరైనా రోగులు గ్రామాల నుండి ఆసుపత్రికి చికిత్సకు వస్తే ఆసుపత్రి సిబ్బందిలో కొందరు ఆ గ్రామ ఆర్ఎంపీ రెఫర్ చేశాడని వైద్యుని నమ్మించి ఆర్ఎంపీ పేరిట సుమారు 40% కమిషన్ కాజేస్తూ కోట్లు గడించినట్టు తెలిసింది.

### వైద్యుడు కేసుల పాలు.. సిబ్బంది కోటీశ్వరులు

జగిత్యాలలో సిబ్బంది కారణంగా వివాదాస్పదమైన ఆ హాస్పిటల్లో తాను నియమించుకున్న సిబ్బందిలో కొందరు తన వెనుక గోతులు తోడుతున్న విషయం గ్రహించని వైద్యుడు ఇటీవల బలమైన కేసులో ఇరుక్కున్నట్టు సమాచారం. సిబ్బందిలో కొందరు మాత్రం వైద్యునికి తెలిసి కొంత మార్కెటింగ్, తెలియకుండా తమ సొంత మార్కెటింగ్ చేసి అనతి కాలంలోనే కోటీశ్వరులు అయ్యారని సమీప హాస్పిటల్ లోని సిబ్బంది గుసగుసలాడుతున్నారు. ఈ ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందిలో వ్యక్తి సుమారు 15 సంవత్సరాల క్రితం పక్క జిల్లా నుండి పొట్ట చేత పట్టుకొని వలస వచ్చి తక్కువ జీతానికి ఆసుపత్రిలో పనికి కుదిరి ప్రస్తుతం కోట్ల విలువ చేసే బంగ్లాలు, ఖాళీ స్థలాలు, వ్యవసాయ భూములు, కారు, ద్విచక్ర వాహనాలు విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడని ప్రచారం జరుగుతోంది. ఇదే వ్యక్తి పట్టణ శివారులో కోట్ల విలువ చేసే గృహాన్ని నిర్మించుకొని, అందులో అన్ని హంగులు ఏర్పాటు చేసుకొని కేవలం విందు వినోదాల కోసమే ఆ ఇంటిని వాడుతున్నాడని, తాను పనిచేసే ఆసుపత్రిలో మాత్రం ఆ ఇల్లు తనది కాదని బుకాయిస్తున్నాడని తనకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని హాస్పిటల్ యాజమాన్యాన్ని నమ్మిస్తున్నాడని తెలిసింది. అమాయకంగా నటించే ఆ వ్యక్తి నిత్యం క్రిమినల్ ఆలోచనలు చేస్తుంటాడని వైద్యుని వెన్నుపోటులో ఇతని పాత్ర కీలకమని చర్చ జోరుగా కొనసాగుతోంది. అంతే కాకుండా ఇతను చెప్పినట్టు సిబ్బంది అంతా నడుచుకోవాలని, లేదంటే వారిని హాస్పిటల్ లో పనిలో నుండి తొలగిస్తారని తెలిసింది. ఈ క్రమంలో సుమారు 6 నెలల క్రితం ఇతను చెప్పిన లేనిపోని మాటలు నమ్మి హాస్పిటల్ అనుబంధ మెడికల్ షాప్ నిర్వాహకున్ని పనిలో నుండి తొలగించారని సమాచారం

### వైద్యుని సొంత ఖర్చులతో సిబ్బందికి ఇంటి నిర్మాణాలు...?

ఎల్లప్పుడూ రోగులు, తన హాస్పిటల్లో పనిచేసే సిబ్బంది పట్ల ఉదార స్వభావంతో మెదిలే ఆ వైద్యుడు తన వెనుక జరుగుతున్న కుట్రలు గ్రహించలేకపోతున్నాడని ఆయన అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది అంతా అద్దె ఇళ్లలో ఉంటున్నారని అపోహపడి వారికి సొంత ఖర్చులతో ఇంటి నిర్మాణాలు కూడా చేసి ఇచ్చాడని జిల్లాలో చర్చ జోరుగా కొనసాగుతోంది. ఈ క్రమంలో సేవ చేసే వైద్యుడు కేసుల పాలు, వైద్యుని నమ్ముకున్న రోగులు అప్పుల పాలు, అందులో పని చేసే సిబ్బంది కోటేశ్వరులుగా మారుతున్నారని ప్రజలు విస్మయానికి గురవుతున్నారు. ఇప్పటికైనా వైద్యునికి తెలియకుండా రోగుల నుండి జరుగుతున్న దోపిడీని అరికట్టేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని, అదే విధంగా హాస్పిటల్ వైద్యుడు కూడా సిబ్బందిని గుడ్డిగా నమ్మకుండా తనపై నమ్మకంతో వచ్చే రోగులను సిబ్బంది బారి నుండి కాపాడాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# ప్రజా ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిన అధికారులు

**సూర్య-గోదావరిఖని:**

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని ప్రజలకు శుచికరమైన, నాణ్యమైన మాంసాన్ని అందేలా చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలం కావడంతో, ప్రజా ఆరోగ్యాన్ని అధికారులు గాలికి వదిలేసారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. భారీ వ్యయంతో నగరంలోని మల్కాపూర్ శివారులో నిర్మించిన స్లాటర్ హౌస్ వినియోగంలో లేకపోవడంతో మటన్ వ్యాపారస్తుల పై నిఘ కొరవడింది. గతంలో ఇక్కడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా పనిచేసిన ఐఏఎస్ అధికారి ఉదయ్ కుమార్ కు ఉన్న సమయంలో స్లాటర్ హౌస్ ను వినియోగంలోకి తీసుకవచ్చారు. కానీ ఆ తర్వాత వచ్చిన అధికారులు ఎవరూ కూడా స్లాటర్ హౌస్ ఒకటి ఉంది అనే విషయాన్ని మరిచిపోవడం గమనార్హం. అసలు విషయానికి వస్తే ఇక్కడ వారాంతం వస్తే.. మాంసాహారం విక్రయించే దుకాణాలన్నీ కిటకిటలాడుతుంటాయి. ఇప్పుడు రాబోయేది దసరా పండుగ కదా ఇక లక్షల రూపాయల్లో వ్యాపారం జరుగుతుంది. ఇక్కడి వరకు బాగానే ఉంది కానీ ప్రజలకు అందించే మాంసంలో నాణ్యత, స్వచ్ఛత విషయంలో కూడా ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఇవాళ ఎక్కడ, ఏ నగరంలో చూసినా... కల్తీ మాంసం విక్రయం యథేచ్ఛగా కొనసాగుతోంది. అపరిశుభ్ర వాతావరణంలో పెరుగుతున్న కోళ్ళు, మేకల్ని వధించి వాటినే అమ్ముతున్నారు. అవి కొని తెచ్చుకుని తిని రోగాల బారిన పడుతున్నప్పటికీ అధికారుల నుండి కనీస స్పందన లేదు. అధికారుల పర్యవేక్షణ ఏ మాత్రం కూడా లేకపోవటం వల్ల నాసిరకం మాంసాన్నే వినియోగదారులకు విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. తనిఖీ లకు వచ్చే అధికారులు కరువయ్యారు. నియోజకవర్గానికి చెందిన ముఖ్య ప్రజా ప్రతినిధి కనుసనల్లో ఈ దందా గత కొన్ని ఏండ్లుగా జరుగుతుండడంతో అధికారులు ఇటువైపు చూడడం లేదనే ప్రచారం ఉంది. అధికారుల నిర్లక్ష్యం ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతుంది అని చెప్పుకోవచ్చు. పశు వైద్యుడి సమక్షంలో ఆరోగ్యకర మేకలు, గొర్రెలు వధించాల్సి



ఉండగా అలా జరగడం లేదు. కోసిన ప్రతి భాగం వైద్యుడు పరిశీలించి తినకూడని భాగాలు తొలగించాలి. ఈ ప్రక్రియ ఎక్కడా అమలుకు నోచుకోవటం లేదు. ప్రతి వినియోగదారుడు దుకాణం వెళ్లి మాంసం కొనుగోలు చేసిన తర్వాత తప్పనిసరిగా యజమాని నుంచి బిల్లు తీసుకోవాలి. సూపర్ మార్కెట్లలో మాంసం లేదా చేపలు కొనుగోలు చేస్తే సంస్థ బిల్లు ఇస్తుంది. అదే తరహాలో దుకాణదారులు బిల్లు ఇవ్వకపోతే పశు సంవర్థక శాఖ, వెటర్నరీ విభాగాలకు ఫిర్యాదు చేయాలి. కానీ ఇది ఎక్కడ కనరావడం లేదు. మూడు లక్షలకు పైగా జనాభా ఉన్న రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో 180 వరకు మటన్ దుకాణాలు ఉన్నాయి. కానీ ఈ దుకాణాలపై పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడం వల్ల వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చనిపోయిన మేకలు, గొర్రెలను సైతం మటన్ షాపుల వెనుక వధించి, ప్రాసెస్ చేసి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అమ్ముడుపోగా మిగిలిన మాంసాన్ని స్టోరేజ్ చేసేందుకు ఇక్కడ ప్రత్యేకమైన సదుపాయాలు లేవు, కానీ మాంసాన్ని మాత్రం నిల్వ చేస్తారు. నిల్వచేసిన మాంసంలో బ్యాక్టీరియా వృద్ధి చెంది, మాంసం కండరాలు కుళ్లిపోయి ఆహారం కలుషితమవుతోంది. దీనికిగాను ఇక్కడ వ్యాపారస్తులు ఒక రకమైన చైనా మందు ను వాడుతారని, వేడి నీటిలో ఆ మందును నాలుగు చుక్కలు వేస్తే వెంటనే ఒక రకమైన నురగ ఏర్పడుగా, ఆ నురగ వచ్చిన నీటిలో కుళ్ళిపోయిన మాంసాన్ని ముంచి తీయడం ద్వారా మళ్లీ ఆ మాంసం ఇప్పుడే వధించిన లేత మాంసంగా మారుతుందని అత్యంత విశ్వసనీయ సమాచారం. నిలువ ఉంచిన మాంసాన్ని తినడం ద్వారా మానవ శరీరంలో నైట్రోసమైన్ అనే ప్రమాదకరమైన రసాయనం తయారవుతుందని పలువురు వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇది ఊపిరితిత్తులు, మెదడు, కాలేయం, మూత్రపిండాలు, గొంతు, కడుపు క్యాన్సర్‌కు కారణమవుతుందని హెచ్చరిస్తున్నారు. ఎక్కువ కాలం నిల్వ ఉంచేందుకు, రుచికి, గులాబీ రంగులో మాంసం ఆకర్షణీయంగా కనిపించేందుకు నైట్రేట్స్ కలుపుతారా లేదా అనేది అధికారులు తేల్చాల్సి ఉంది. మొత్తానికి ప్రజారోగ్యంపై జిల్లా అధికార యంత్రాంగం తో పాటు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సైతం తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. స్లాటర్ హౌస్ ను వినియోగంలోకి తీసుకువస్తే ఎవరికి నష్టం జరుగుతుంది అనే విషయంపై అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. అప్పుడు సమస్యకు పరిష్కారం సులువుగా దొరుకుతుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు మాంసం విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.

## డీఎస్సీ అభ్యర్థుల నియామక సమావేశానికి బస్సులను ప్రారంభించిన జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు

**సూర్య జగిత్యాల ప్రతినిధి**




హైదరాబాదు లో ఎల్ బి స్టేడియంలో ముఖ్యమంత్రి సమావేశానికి జగిత్యాల జిల్లా లో నూతనంగా ఎన్నికైన 269 మంది అభ్యర్థులను డి,ఎస్ ,సి 2024 అభ్యర్థులకు అపాయింట్ మెంట్ ఆర్డర్ లను తీసుకునేందుకు 7 ఆర్టీసీ బస్సులను జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి అదనపు కలెక్టర్ రాంబాబు జెండా ఊపి ప్రారంభించారు. ఒక్కొక్క బస్ లో విద్యాశాఖ నుండి ఇద్దరు మండల విద్యాధికారులు ఒక లైసన్ అధికారులు ఒక పోలీసు, వైద్య శాఖ నుండి ఒక అధికారిని బస్సులలో వారి వెంట పంపించడం జరిగిందనీ తెలిపారు. అనంతరం ఎంపికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, AO,DWO అధికారులు, నరేష్, బిసి, ఎస్సీ, అధికారులు, సాయి బాబా, రాజు కుమార్ మైనార్టీ అధికారి, చిత్రు, తదితరులు పాల్గొన్నారు.

## షటర్ పగలగొట్టి వైన్స్‌లో దొంగతనం

**-రూ. 10వేల నగదు, సెల్ ఫోన్,రూ. 5600 మద్యం బాటిల్లా చోరీ.**

**సూర్య గంభీరావుపేట**



గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామంలోని ఎల్లమ్మ తల్లి వైన్స్ లో చోరీ జరిగింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లింగన్నపేట గ్రామంలోని ఎల్లమ్మ తల్లి వైన్స్ లో మంగళవారం అర్ధరాత్రి షట్టర్ పగలగొట్టి రూ. 10వేల నగదు, ఒక సెల్ ఫోన్, రూ. 5600 విలువగల మద్యం బాటిల్లు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం చోరి విషయాన్ని గుర్తించిన వైన్స్ యజమాని బుర్ర సాయి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏస్ ఐ శివకుమార్ తెలిపారు.

## హైమాస్ లైట్లు ప్రారంభం

**- కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హమీద్**

**సూర్య గంభీరావుపేట**



గంభీరావుపేట మండల కేంద్రంలోని న్యూ హనుమాన్ నగర్‌లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ హమీద్ నాయకులతో కలిసి నూతనంగా ఏర్పాటుచేసిన హైమస్ లైట్లను బుధవారం ప్రారంభించారు. ఎస్ డిఎఫ్ నిధులతో మండలానికి 25 హైమస్ లైట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పాపగారి రాజు గౌడ్ ఏఎంసి వైస్ చైర్మన్ పాతూరి అంజిరెడ్డి డైరెక్టర్ ఎడబోయిన ప్రభాకర్ మండల మాజీ వైస్ చైర్మన్ జంగ కాశి రాములు సోషల్ మీడియా కన్వీనర్ గౌరీ శంకర్ , సీనియర్ నాయకులు జంగం రాజు పెద్దివేని మల్లయ్య, బంగ్లా రాజు గౌడ్ అక్క పెల్లి బాలయ్య లక్కం నాంపల్లి,తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ మాజీ చైర్మన్ కు ఘన నివాళులు

**సూర్య- కోరుట్ల**



కోరుట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ గండ్ర రాజనర్సింహారావు ఎనిమి దవ వర్ధంతి సందర్భంగా బుధ వారం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రజా సేవ చేసిన వ్యక్తి రాజా నరసింగ రావుఅని అన్నారు. ఈ కార్యక్రమంలో గండ్ర శిల్ప, ఎంబీరి నాగభూషణం, పుప్పాల ప్రభాకర్, నాయకులు దారిశెట్టి రాజేష్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్జీ-2 లో భారీ సింగరేణి బతుకమ్మ

**సూర్య, సెంటినరీ కాలనీ**



ఆర్జీ-2 డివిజన్ 8వ కాలనీ లో సింగరేణి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహి ంచారు. జీఎం ఎల్.వి. సూర్య నారాయణ, రెస్క్యూ జీఎం కంపల్లి శ్రీనివాస్ రెడ్డి,ఏరియా రక్షణాధికారి సంతోష్ కుమార్, అధికార ప్రతినిధి అనీల్ కుమార్ పాల్గొన్నారు.

# కరీంనగర్ నగరపాలక సంస్థలో అవినీతి అధికారులపై విచారణ జరపాలి

## - కరీంనగర్ నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ డిమాండ్
## - జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు రద్దు చేసి ఇబ్బంది పెట్టొద్దు

**సూర్య, కరీంనగర్ ప్రతినిథి**




నగరపాలక సంస్థలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలలో కార్మికుల నుండి కోట్లాది రూపాయలు వసూలు చేసిన కొందరు అవినీతి అధికారులపై విచారణ జరిపించాలని కరీంనగర్ నగర బిఆర్ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్ డిమాండ్ చేశారు. బుధవారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర పాలక సంస్థలో మున్సిపల్ ఔట్ సోర్సింగ్ నియామకాల్లో అవినీతి జరిగింది. 2020లో 1323 మంది ఉన్న ఔట్ సోర్సింగ్ కార్మికులు 2024వరకు 15 వందలపై చిలుకు చేరుకుంది. నాలుగున్నర సంవత్సరాల్లో అదనంగా మరో 196 మందిని నియమించారని అన్నారు. నియామకాల కోసం ఎలాంటి నోటిఫికేషన్ ఇంటర్వ్యూలు నిర్వహించకుండా ఒక్కో పోస్టుకు 2 నుంచి 3 లక్షలను అధికారులు వసూలు చేసారని అన్నారు. మున్సిపల్ లో ఔట్ సోర్సింగ్ నియామకాలను 2016లో వారధికి అప్పగించారు. మున్సిపల్ రిక్రూట్మెంట్‌కు అనుగుణంగా మున్సిపల్ కమిషనర్ వారధికి లేఖ రాయాలి. ఔట్ సోర్సింగ్ కార్మికులను నియమించేది. వారికి జీతాలు ఇచ్చేది వారధినే అని అన్నారు. మున్సిపల్ అధికారులు నియమ నిబంధనలను తుంగలో తొక్కారు. సుమారు 5 కోట్లు వసూలు చేసి ఇష్టారీతిన నియామకాలు చేపట్టారని అన్నారు. అక్రమ నియామకాలపై విచారణ చేపట్టి ఎవరి డబ్బులు వారికి ఇప్పించాలి. గడిచిన నాలుగున్నర సంవత్సరాల్లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తీసుకోవాలని కోరారు. నియామకాల్లోనే కాదు కార్మికుల కిచ్చే వేతనాల్లో కూడా అధికారులు చేతివాటం చూపించారు. గైర్హాజరైన కార్మీకులకు కూడా వేతనాలు చెల్లించి తర్వాత వసూళ్ళు చేస్తున్నారు అని ఆరోపించారు. వేతనాల పేరుతో నగరపాలక సంస్థకు చెందిన 15 కోట్ల రూపాయలు అధికారులు నొక్కేశారు. అధికారులు కోట్లాది రూపాయల మున్సిపల్ సొమ్మును నొక్కేసి జేబుల్లోకి మళ్ళించుకుంటున్నారు. సొమ్ము ను రికవరీ చేయాలి అని అన్నారు. మున్సిపల్‌లో వందకోట్ల అవినీతి జరిగింది. అధికారులతీరుతో నగర పాలక సంస్థ అప్పుల పాలయ్యే పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించకుండా చివరకు బతుకమ్మ ఏర్పాట్లు కూడా చేపట్టలేని పరిస్థితి వచ్చింది అని అన్నారు. దీనిపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తాం. కేంద్ర మంత్రి బండి, రాష్ట్ర మంత్రి పొన్నం చొరవ తీసుకుని నగర పాలక సంస్థలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలి అని అన్నారు. నగర పాలక సంస్థలో జరిగిన అవినీతిపై బిఆర్ఎస్ పోరాటాలు చేస్తుంది అని అన్నారు. పండుగల వేళ జర్నలిస్టులను బాధ పెట్టొద్దు వారి ఇండ్ల స్థలాలను రద్దు చేయాలని చూస్తే ఊరుకోబోము. వెంటనే కలెక్టర్ ధరణి యాక్ట్ ప్రకారం తన సుప్రీం పవర్స్ ఉపయోగ గించి జర్నలిస్టుల ఇండ్ల స్థలాలను అప్పగించాలి అని అన్నారు. జర్నలిస్టులకు అండగా ఉండి వారి పోరాటాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, బిఆర్ఎస్ యూత్ నగర అధ్యక్షులు కుల్ దీప్, బిఆర్ఎస్ నగర మైనార్టీ అధ్యక్షులు షౌకత్, కరీంనగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చెందు, 37వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అరె రవి గౌడ్, 55వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చేతి చంద్రశేఖర్, 29వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జెల్లోజీ శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## టీజీ ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో శ్రీ నవ చండీ హోమం

**సూర్య, కరీంనగర్ టౌన్**



కరీంనగర్ టీజీ ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో శ్రీ నవ చండీ హోమం కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరీంనగర్ మున్సిపల్ కమిషనర్, చాహత్ వాజ్పాయి ముఖ్య అతిథులుగా హాజరైనారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ప్రారంభించినారు. పూజా కార్యక్రమం అనంతరము హోమము చేసినారు. సంస్థ సంక్షేమం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపినారు. ఈ కార్యక్రమంలో విజయేందర్ రెడ్డి, రాజం, తిరుపతి, చంద్రమౌళి, కాళిదాసు, ఏడీలు నరేందర్, లావణ్య ,స్వప్న ఎస్సై ఓ.రాజేశం, ఏవో రాజేంద్రప్రసాద్, అరవింద్, పులి రఘుపతి, అంజయ్య, జనార్దన్, శ్రీనివాస్, బి.చంద్రయ్య, డి సంపత్ కుమార్, రాజు, అన్ని యూనియన్ల అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.



## జంతు జనన నియంత్రణ కేంద్రం ప్రారంభం

**సూర్య, హుజురాబాద్**



వీధి కుక్కల బెడద తగ్గించడం కోసం మున్సిపల్ పరిధిలోని బోర్నపల్లిలో బుధవారం పశు వైద్యశాల ఆవరణలో జంతు జనన నియంత్రణ కేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక ప్రారంభించారు. వీధి కుక్కల బెడద అధికంగా ఉన్నందున, వాటిని పట్టుకొని జనన నియంత్రణ ఆపరేషన్లను నిర్వహించుటకు నూతనంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్య క్రమంలో పురపాలక సంఘ పాలకవర్గ సభ్యులు, కమిషనర్ సల్వాది సమ్మయ్య, కార్యాలయ మేనేజర్ ఆర్. భూపాల్ రెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ జి. సాంబరాజు, వార్డు అధికారులు, సానిటరీ ఇన్స్పెక్టర్ యం. కిషన్ రావు, సానిటరీ జవాన్లు, పురపాలక సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

## సరస్వతీ నమస్తుభ్యం

**- ఘనంగా దుర్గా భవానీ నవరాత్రోత్సవాలు**
**- వీణా శారద అలంకరణలో అమ్మవారు**

**సూర్య, కొత్తపల్లి**



కరీంనగర్ మండలం నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో దుర్గాభవానీ నవరాత్రులు వైభవంగా ప్రారం భమైనాయి. ఏడవ రోజు బుధవారం మూల నక్షత్రం కావడంతో అమ్మవారు సరస్వతీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఇంద్రాణి అలంకరణలో ఐరావత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు, ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చి పూజలు నిర్వహించారు. అమ్మవారి దీక్షదారులకు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేసారు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని చీరేసారె పెట్టి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటీ బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మహిళా కాంగ్రెస్ పార్టీ నాయకురాళ్ల ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ వేడుకలు సంతోషాల మధ్య జరుపుకున్నారు. బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని సర్వాంగా సుందరంగా అలంకరింపజేశారు. వివిధ రకాల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు బతుకమ్మలను పెట్టి వాటి చుట్టూ చేతులతో లయబద్ధంగా కొడుతూ బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో, బంగారు బతుకమ్మ ఉయ్యాలంటూ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బ్లాక్ కాంగ్రెస్ మహిళ అధ్యక్షురాలు ఆలేటి సుశీల గాజులు, పూలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆలేటి సుశీల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షురాలు యేముల పుష్పలత, పూదరి రేణుక, కోడం రజిత, కదారి తిరుమల, మల్లీశ్వరి, మంద మంజుల, పుల్ల రాధ, చిదిరాల సునీత, సొల్లు సునీత, ఎండి. కరీమా, తోట స్వప్న, రజిత స్వరూప, రిబ్కా, నాయకులు కొల్లూరి కిరణ్ కుమార్, సొల్లు బాబు, మిడిదొడ్డి రాజు, ఉప్పరి శ్రీనివాస్ పటేల్, తాళ్ళపెల్లి రమేష్, ఎర్ర రవీందర్, గంట కిరణ్ రెడ్డి, ఎండి. షాధిక్, ఎండి. రియాజ్ పాల్గొన్నారు.

## దసరాలోపు ఫీజు రీయింబర్సుమెంట్ విడుదల చేయాలి

**- లేకుంటే కళాశాలలు తెరువబోమని సుప్మా నిర్ణయం**

**సూర్య, కరీంనగర్ ప్రతినిథి**



దసరాలోపు గత 3 సంవత్సరాలుగా పెండింగులో ఉన్న ఫీజు రీయింబర్సుమెంట్ విడుదల చేయకుంటే కళాశాలలు తెరువబోమని, తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ పిలుపు మేరకు శాతవాహన యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించారు. ఈ సందర్భంగా శాతవాహన యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం వెంకటేశ్వర రావు, జాయింట్ సెక్రటరీ జి కృష్ణ నేదు శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సుప్మా అధ్యక్షుడు వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ఫీజు రీయింబర్సుమెంట్ రాక కళాశాలల యాజమాన్యాలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేక, భవన అద్దెలు చెల్లించలేక, తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. తక్షణమే ఫీజు రీయింబర్సుమెంట్ చెల్లించి, నాణ్యమైన విద్యను అందించే ప్రైవేట్ కళాశాలలను ఆదుకోవాలని కోరారు. అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో దసరా లోపు ఫీజు రీయింబర్సుమెంట్ చెల్లించకుంటే, దసరా సెలవుల తర్వాత కళాశాలలను తెరువబోమని స్పష్టం చేశారు.

## శివాని కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**సూర్య, కరీంనగర్ టౌన్**



మంకమ్మతోటలోని శివాని డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చారు. విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో తెలంగాణ ధనం ఉట్టిపడేలా బతుకమ్మ పాటలతో అలరించారు. విద్యార్థులు వివిధ రకాల పిండి వంటలు, సద్దులు తెచ్చి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. యూనివర్సిటీ పాలకవర్గ సభ్యురాలు మరియు కళాశాల ప్రిన్సిపాల్ అయిన వంగపల్లి ఉమాదేవి సతీష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని పండుగలను కళాశాలలో సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తామని గత కొన్ని సంవత్సరాలుగా బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నామని విద్యార్థులు కూడా చాలా ఉత్సాహంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటున్నారని విద్యార్థులకు చదువుతోపాటు తెలంగాణ సాంప్రదాయాలను భావితరాలకు అందించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వంగపల్లి ఉమాదేవితో పాటు డైరెక్టర్లు ఎర్రంశెట్టి మునిందర్, సిరిపురం ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయ క్షేత్రంలో మెగా ఫీల్డ్ డే

**సూర్య, కొత్తపల్లి**



నాథ్ బయో-జీన్స్ ఇండియా లి.వారి నూతన పత్తి రకం రాణా-900 బీజీ 2 ఫీల్డ్ కొత్తపల్లి హవేలి గ్రామంలోని శివ కృష్ణ అనే రైతు చేసులో పత్తి మెగాఫీల్డ్ దే ప్రదర్శణ కేంద్రాన్ని నాథ్ బయో-జీన్స్ ఇండియా లి.కంపెనీ వారు ఏర్పాటు చేశారు. రాణా ఎక్కువ దిగుబడినిచ్చే హైబ్రిడ్ రకం. రసం పీల్చే పురుగులను సమర్థవంతంగా తట్టుకుంటుంది. పత్తి తీయుట సులభంగా ఉంటుంది. ప్రస్తుత కాలంలో తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడిని ఇచ్చే హైబ్రిడ్ రకం."రాణా 900" అని కంపెనీ ప్రతినిధులు తెలిపిన వారు. శివ ప్రసాద్ రావు ఏ .జి .ఎం, తిరుపతి డి. ఆర్. ఎం, డిస్ట్రిబ్యూటర్ దుర్గాదేవి ట్రేడర్స్ బిక్కి సురేష్ బాబు గారు, డీలర్స్ శ్రీనివాస్ సంజీవ్ గారు మరియు కంపెనీ ఎస్ .ఎఫ్ .ఏ మహేందర్, శ్రీకాంత్ గార్లు కొత్తపల్లి హవేలీ కొక్కెర కుంట, వన్నారం, కాట్నపల్లి, దేశరాజుపల్లి, నునుగొండపల్లి, వెలిచాల గ్రామ ప్రజలు సుమారు 230 మంది పాల్గొన్నారు.

## బతుకమ్మ ఏర్పాట్లు పూర్తి

**సూర్య, వీణవంక**



వీణవంకలో నేడు జరుగు సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా బుధవారం తాజా, మాజీ సర్పంచ్ నీల కుమార్ స్వామి దగ్గరుండి అన్ని పనులను పూర్తి చేయించారు. ప్రత్యేకంగా సమ్మక్క గద్దెల దగ్గర డెకరేషన్, లైట్స్, క్లీనింగ్ పనులను చక్కగా నిర్వహించడమే కాకుండా, ఎస్సి కాలనీ వారి కోసం రామకృష్ణాపూర్ వాగు దగ్గర కూడా పూర్తి క్రమంలో క్లీనింగ్, లైటింగ్, డెకరేషన్ పనులు పూర్తి చేయించారు.

## జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**సూర్య, కరీంనగర్ టౌన్**



కరీంనగర్‌లో జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో కూలి పని చేసుకునే మహిళలతో బతుకమ్మ సంబరాలు చేసుకోవడం జరిగింది. ఇందులో భాగంగా వారికి బతుకమ్మ పేర్చే పోటీలు పెట్టి బహుమతుల ప్రధానం చేశారు. బతుకమ్మ పండుగ అంటేనే కొత్త బట్టలు ధరించి ఆడపడుచులు ఆడుకుంటారు. కనుక వారందరికీ మహిళలకు,పిల్లలకు కొత్త చీరలు, డ్రెస్సులు పంపిణీ చేయడం జరిగింది. కూలి పని చేసుకునే వారి మధ్యలో బతుకమ్మ సంబరాలు చేసుకోవడం అనేది మాకు చాలా సంతోషము కలిగిస్తుంది. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్, రూప,హనురూప్,లక్ష్మీ తదితరులు పాల్గొనడం జరిగింది.



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
జగిత్యాల
గురువారం 10 అక్టోబర్ 2024


# ఎస్సీ వర్గీకరణ పై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి

## - ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్

**సూర్య-కోరుట్ల**

దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు ఆగస్టు ఫస్టన ఎస్సీ, ఎస్టీల వర్గీకరణపై ఇచ్చిన సంచలనాత్మక తీర్పును గౌరవిస్తూ తెలంగాణ అసెంబ్లీ నిండు సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో వర్గీకరణ అమలు చేస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ, అంబేద్కర్ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్ ముఖ్యమంత్రిని కోరారు. బుధవారం కోరుట్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద డిస్సీ ఫలితాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయక పోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలు చేస్తున్న నిరసనలో భాగంగా అంబేద్కర్ మాదిగ సంఘం అధ్యక్షుడు శనిగారపు రాజేష్ ఆద్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పేట భాస్కర్ మాట్లాడు



తూ ఎస్సీ వర్గీకరణను అన్ని ప్రభుత్వ రంగాలతో పాటు డిఎస్సీ లో సైతం వర్గీకరణ చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట నిలుపుకోవాలని బుధవారం ఇవ్వనున్న డిఎస్సీ నియామకపు పత్రాలలో ఎస్సీ లకు సంబంధించిన 15 శాతం నియామకాలను అపివేయాలని వర్గీకరణ చేశాకే ఇవ్వాలని కోరారు. జనాభా ప్రాతిపదికన ఎస్సీ కులాల న్యాయ బద్దమైన పోరాటంలో విఘాతం కలిగించే ప్రయత్నాలు మానుకోవాలని వర్గీకరణపై వేసిన అనేక రివ్యూ పిటిషన్లను సుప్రీం కోర్టు కొట్టివేసిందని ఇది మాల, మాదిగల పంచాయతీ ఏ మాత్రం కాదని ఎస్సీల లోని 59 కులాల సమాంతర ఫలాల పంపిణీ పోరాటం అని పేట భాస్కర్ అన్నారు. అంతకు ముందు అంబేద్కర్ భవన్లో బహుజన పితామహుడు మాన్య కాన్షీరాం వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ మాదిగ కుల సంఘం అధ్యక్షులు శనిగారపు రాజేష్, మండల అధ్యక్షులు జాగర్ల రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ రాజయ్య, సీనియర్ నాయకులు మారంపెల్లి నర్సయ్య, బొల్లే గంగాధర్, తాళ్లపెల్లి రాజగంగారాం, చిట్యాల మధు, వొటారికారి సాయన్న, రాజేందర్, బైరి రవిదాస్,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

## - మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్

**సూర్య కొడిమ్యాల**

జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన దండుగుల రాజం గత కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా మృతునికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉన్నందున రెండు లక్షల రూపాయల చెక్కును బుధవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ స్వయంగా మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త దండుగుల రాజం పార్టీకోసం ఎనలేని సేవలు చేశారని అన్నారు. భారతదేశంలో 60 లక్షల సభ్యత్వం కలిగిన ఏకైక పార్టీ బీఆర్ఎస్ పార్టీ దేశంలో ఏ రాజకీయ పార్టీ కూడా కార్యకర్త



చనిపోయిన ఆదుకోదు అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బారాస పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, మాజీ మంత్రి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావులు ప్రతీ కార్యకర్తకు వెన్నుదన్నుగా నిలిస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పొనుగోటి కృష్ణారావు, బారాస మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, చొప్పదండి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు బందారపు అజయ్ కుమార్ గౌడ్, పట్టణ అధ్యక్షులు కొత్తూరు స్వామి, గ్రామ ఐక్య సంఘం అధ్యక్షు అంకం రాజేశం, ఒల్లాల లింగాగౌడ్, గడ్డం లక్ష్మారెడ్డి, పర్లపల్లి ఆనందం, ఏగుర్ల తిరుపతి, బొడ్డు రమేష్, చెక్కపెల్లి స్వామి రెడ్డి,మల్యాల మహిపాల్, బైరి వెంకటి, సరిపల్లి రత్నాకర్, పులి శ్రీనివాస్, బోనగిరి లక్ష్మీ నర్సయ్య, బండపల్లి అంజన్ కుమార్, పర్లపల్లి ప్రభుదాస్,దీకొండ చంద్రశేఖర్, సల్మాన్, పాదం శ్రీనివాస్, చందు,హరేందర్, పాల్గొన్నారు.

# అమ్మవారిని దర్శించుకున్న విప్ అడ్లూరి

**సూర్య పెగడపల్లి**



దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని బతికపల్లి, నందగిరి, ఐతు పల్లి గ్రామాలలో దుర్గా నవరాత్రి మండపాల్లో సరస్వతీ రూపంలో కొలువైన అమ్మవారిని బుధవారం ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు నాగరాజు శ్రీనివాసచార్య, మధుకర్ చార్యులు ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ హరిణి హాస్పిటల్ కరీంనగర్ డాక్టర్ పంగ రమేష్ పేరిట అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. దసరా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని లక్ష్మణ్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, పార్టీ వివిధ హొదాలో ఉన్న నాయకులు తాటిపర్తి శోభారాణి, ప్రభాకర్ రెడ్డి ఎలగొండ కృష్ణ హరి, మద్దెల సుధీర్, కమిటీ సభ్యులు కంతం మల్లయ్య, బేతి సత్యనారాయణ, బాలుసాని శ్రీనివాస్ గౌడ్, లచ్చయ్య గౌడ్, పురెళ్ళి శ్రీనివాస్ గౌడ్, పొనగంటి రాజయ్య, చింతకుంట్ల శ్రీనివాస్, బత్తిని శేఖర్, పోచంపల్లి రవి, సుంకే దుర్గాప్రసాద్, జుపాక శ్రీనివాస్, మూగల మనోహర్, పోరండ్ల శ్రీనివాస్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# దళిత హక్కుల పోరాట సమితి కమిటీ

**సూర్య పెగడపల్లి**

దళిత హక్కుల పోరాట సమితి అడక్ కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్ అధ్యక్షతన పెగడపల్లి మండల కమిటీ ఎన్నిక బుధవారం నిర్వహించారు. పెగడపల్లి దళిత హక్కుల పోరాట సమితి మండల కన్వీనర్గా బొమ్మెన పురుషోత్తం, కో కన్వీనర్గా సుంకే ప్రకాష్, దీకొండ రాజు, కమిటీ సభ్యులుగా కల్లేపల్లి సుధాకర్ కొత్తూరి హరికృష్ణ, ఆత్మకూరి రాజేశం, కొత్తూరి గోపి, జంగిలి నరేష్, వేణు, నరసయ్య అంజయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు రాచర్ల సురేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల కరీంనగర్ ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదం

**- అదుపుతప్పి చెట్టుకు ఢీకొన్న డీసీఎం వాహనం**

**- డ్రైవర్‌కు తీవ్రమైన గాయాలు**

**సూర్య, మల్యాల**



మండలంలోని కొండగట్టు శివార్లో పంచముఖ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద కామారెడ్డి నుంచి మంచిర్యాల వెళుతున్న ఫ్రీడం నూనె లోడ్తో డీసీఎం వ్యాన్ అదుపుతప్పి చెట్టును ఢీకొని బోల్తా పడింది వ్యాన్ క్యాబిన్లో డ్రైవర్ ఇరుక క్కపోగా ఈ సమాచారం తెలుసుకున్న మల్యాల పోలీసులు జగిత్యాల అగ్నిమాపక రెస్క్యూ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని గంటన్నర పాటు రెస్క్యూ ఆపరేషన్ చేసి డ్రైవర్ను సురక్షితంగా బయటకు తీశారు. డ్రైవర్ దుర్గయ్య తీవ్రంగా గాయాల య్యాయి. అతడిని 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో మల్యాల ఎస్సై నరేష్, ఎం రాజేందర్, జగిత్యాల ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికులకు కాటమయ్యకిట్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**సూర్య, కోరుట్ల రూరల్**



మండలంలోని యూసుఫ్ నగర్ గ్రామంలో కాటమయ్య కిట్స్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఈ సందర్భంగా మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా నిర్భయంగా కాకమయ్య కిట్టుతో ఈత చెట్ల పైకి ఎక్కడ సులభం అవుతుందని ప్రమాదాలు జరగకుండా ఉండడానికి కాటమయ్య కిట్లను పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే సంజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు,బీఆర్ఏస్ నాయకులు, గౌడ సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# దుర్గాదేవి మండపాల్లో ఎమ్మెల్సీ పూజలు

**సూర్య జగిత్యాల అర్బన్**



భక్తుల కొంగు బంగారంగా కోరిన కోరికలు తీర్చే ఇలవేలుపు దైవం అమ్మ అని అమ్మ దయ ఉంటే అన్ని ఉన్నట్లేనని, అమ్మవారు అందరిని చల్లంగా చూడాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం దుర్గాదేవి నవరాత్రి వేడుకల్లో భాగంగా పలు మండపాలను దర్శించుకొని దుర్గామాతకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని శ్రీ దుర్గాదేవి మండపంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. వారి వెంట మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు యూత్ నాయకులు సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మండప నిర్వహకులు పాల్గొన్నారు.

# పిచ్చి కుక్క దాడిలో యువకునికి తీవ్ర గాయాలు

**సూర్య జగిత్యాల**



జగిత్యాల పట్టణంలోని సుతారి పెట్లో కాలినడకన రోడ్డుపై వెళ్తున్న అజీజ్ ఖాన్ అనే యవకునిపై బుధవారం పిచ్చి కుక్క దాడి చేసింది. ఈ దాడిలో యువకుని నడుముపై తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు బాధితున్ని చికిత్స నిమిత్తం హుటా హుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే పట్టణంలో కుక్కల సంఖ్య ఎక్కువయిందని, టి ఆర్ నగర్లో ఎనిమల్ కేర్ సెంటర్ పేరుకే ఏర్పాటు చేశారని, అక్కడికి తరలించాల్సిన కుక్కలు పట్టణంలో సంచరించి చిన్నారులను గాయపరుస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

# బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య

**సూర్య మల్లాపూర్**



బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ పబ్బ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. మండల కేంద్రానికి చెందిన నల్ల లక్ష్మి జానయ్య దంపతులకు ఇద్దరు కూతుర్లు కాగా ఇద్దరికీ వివాహాలు జరిపించారు. చిన్న కూతురు భాగ్యలక్ష్మికి విడాకులు కావడంతో అప్పటినుంచి ఇంటి వద్దనే వుంటుంది. ఈ క్రమంలో తన కూతురి పరిస్థితిని చూడలేక మనస్తాపం చెందిన నల్ల లక్ష్మి (60) మంగళవారం రాత్రి మల్లాపూర్ లోని త్రాగునీటి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి పెద్దకూతురు గంగజల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# దుర్గాదేవి మండపాల వద్ద ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు

**సూర్య, కథలాపూర్**



దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో బుదవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంభీర్ పూర్, అంబారీపేట దుర్గా దేవి మండపాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంత ఆయురారోగ్యాలతో ఆరోగ్యంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

పెద్దపల్లి

గురువారం 10 అక్టోబర్ 2024 5


## ఎమ్మెల్సీ ఓటర్ నమోదు గడువు పై విస్తృత ప్రచారం నిర్వహించాలి

### - మంథని ఆర్ డి ఓ వి. హనుమనాయక్

**సూర్య మంథని**

ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలలో పాల్గొనేందుకు అర్హులైన ఓటర్లు తమ పేర్లను ఓటరు జాబితాలో నవంబర్ 6 లోపు నమోదు చేయాలని మంథని ఆర్డీవో హనుమా నాయక్ అన్నారు. ఉపాధ్యాయుల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గాలకు సంబంధించి ఓటర్ల జాబితాలను ఎన్నికల ముందు ప్రతిసారి కొత్తగా తయారు చేస్తామని, గతంలో ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వ్యక్తులు కూడా తప్పనిసరిగా ఉపాధ్యాయులు ఫారం 19 ప్రకారం, పట్టభద్రులు ఫారం 18 ప్రకారం నూతనంగా దరఖాస్తును నవంబర్ 6 లోపు సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. నవంబర్1,2024 ముందు 6 సంవత్సరాలలో కనీసం మూడు సంవత్సరాల పాటు సెకండరీ స్కూల్ కంటే తక్కువ స్థాయి కాకుండా విద్యా బోధనలో నిమగ్నమై ఉన్న ఉపాధ్యా



యులు, నవంబర్ 1,2024 కంటే 3 సంవత్సరాల క్రితం (1 నవంబర్ 2021) నాటికి డిగ్రీ లేదా సమాన స్థాయి విద్య పూర్తి చేసుకున్న పట్టభద్రులు ఓటరుగా నమోదు కావడానికి అర్హులని తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు, పట్ట భద్రులుతమ దరఖాస్తులను సంబంధిత సర్టిఫికెట్లను జత చేస్తూ ఫారం 19 ప్రకారం తహసిల్దార్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం నందు మాన్యువల్‌గా లేదా ceotelangana.nic.in అనే వెబ్ సైట్ లో ఆన్లైన్ ద్వారా నవంబర్ 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు నవంబర్ 23 న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా ప్రచురించాలని, డిసెంబర్ 25 లోపు పరిష్కరించాలని, డిసెంబర్ 30న తుది ఓటర్ జాబితా ప్రచురించాల్సి ఉంటుందని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు గడువు పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, డిగ్రీ ప్రొఫెషనల్ కాలేజీల, ప్రభుత్వ ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అర్హులైన పట్టభద్రులు తప్పనిసరిగా ఓటర్‌గా నమోదు చేసుకునేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు సమ్మయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు అజీమ్ ఖాన్, మరియు 10 మండలాల తహసిల్దార్‌లు, నాయబ్ తహసీల్దార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఉద్యోగులకు 'దసరా' భోజనంకు రూ. 97 లక్షల కేటాయింపు

### - 72 వేల ఉద్యోగులకు

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థలో ఉద్యోగులకు గురువారం, శుక్రవారాలలో ఏదైనా ఒక రోజు దసరా భోజనం ఏర్పాటు చేయాలని యాజమాన్యం ఉత్తర్వులను జారీ చేసింది. సింగరేణిలో ఈ మధ్య కాలంలో ఉద్యోగులకు లాభాల వాటా పంపిణీ చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సిఅండ్ఎండి నేనావత్ బలరాం సంస్థ లోని అన్ని గనులు, ఓపెన్ కాస్ట్ లపై ఉద్యోగులకు భోజనం ఏర్పాటు చేయాలనీ నిర్ణయించారు. దీనికి తోడు సంస్థ అభివృద్ధి, లాభాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సింగరేణిలో 41 వేల మంది పేర్మినేట్ ఉద్యోగులు, 31 వేల మంది కాంట్రాక్టు



కార్మికులకు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేయాలనీ నిర్ణయించారు. సింగరేణిలో 41 గనులు, 11 జీఎం కార్యాలయాలు, రెండు కార్యాలయాలలో మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి ఏరియా వారికి మధ్యాహ్న భోజనానికి కేటాయించిన బడ్జెట్ వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బెల్లంపల్లి ఏరియాకు రూ. 270000/-, మందమర్రి ఏరియాకు రూ. 1150000/-, శ్రీరాంపూర్ ఏరియాకు రూ. 1985000/-, ఎస్టీపిపికి రూ. 60000/-, ఆర్జీ-1 ఏరియాకు రూ. 1150000/-, ఆర్జీ-2 ఏరియాకు రూ. 750000/-, ఆర్జీ-3 అండ్ ఏపిఎ ఏరియాకురూ. 875000/-, భూపాలపల్లి ఏరియాకు రూ. 1235000/-, ఎల్లందు ఏరియాకు రూ. 285000/-, కొత్తగూడెం ఏరియాకు రూ. 635000/-, మణుగూరుకు రూ. 690000/-, కార్పొరేట్ హెడ్ ఆఫీస్‌కు రూ. 285000/-, కార్పొరేట్ హైదరాబాద్ ఆఫీస్‌కు రూ. 60000/-లు కేటాయించారు.

## దుర్గామాతల వద్ద కుంకుమ పూజలు

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపాల వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మంగళవారం రాత్రి కుంకుమ పూజలు నిర్వహించారు. ఊషన్నపల్లిలోని ఆంజనేయస్వామి టెంపుల్ వద్ద ఏర్పాటుచేసిన దుర్గాదేవి మండపం వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దుర్గామాత దర్శనం ఇచ్చారు. గ్రామ పురోహితులు నిట్టూరి అంబరీష్ శర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

## రామగిరి స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓ

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండల స్పెషల్ ఆఫీసర్ గా మంథని ఆర్డీవో వీ.హనుమానాయక్ బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ స్పెషల్ ఆఫీసర్ గా ఉన్న జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య ను ధర్మారం స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవోను ఎంపీడీఓ బద్రి శైలజ రాణి, తహసీల్దార్ బోర్కరి రామచందర్ రావు, మంథని డీ ఎల్ పి ఓ కొమ్మెర సతీష్, ఎం పీ ఓ దేవరకొండ ఉమేష్, స్థానిక సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర శాఖ కార్యవర్గంలో పలువురికి చోటు

**సూర్య-పెద్దపల్లి రూరల్**



పెద్దపల్లిలో పనిచేయుచున్న పలువురు ఉపాధ్యాయులకు (ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్) పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర శాఖ కార్యవర్గంలో పలువురికి చోటు దక్కింది. చిలువేరు సదాశివ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా చిలువేరు సదాశివ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నీలం నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఓల్లే శ్రీనివాస్ నియామకమయ్యారు. వీరి నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రు సురేష్, గండు కృష్ణమూర్తిలకు మరియు పెద్దపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తిరుపతి, రాములుకు ఈ సందర్భంగా సదాశివ, నరేందర్, శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. పి ఆర్ టి యు టిఎస్ సంఘం పటిష్టతకు ఉపాధ్యాయ సమస్యల సాధనకు తమ వంతు కృషి చేస్తామని వారు తెలిపారు.

## ఎస్వోటు జిఎంకు ఏజిఎంగా పదోన్నతి

**సూర్య, సెంటినరీ కాలనీ**

ఆర్జీ-3 ఎస్వోటు జిఎం గుంజపడుగు రఘుపతి కి పదోన్నతి లభించింది. ఎజిఎంగా పదోన్నతి కల్పిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు ఎస్వోటు జిఎం గుంజపడుగు రఘుపతికి శుభాకాంక్షలు తెలిపారు.



## శరన్నవరాత్రి ఉత్సవాల్లో అన్నప్రసాద వితరణ

**సూర్య జూలపల్లి**



దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు దారబోయిన నరసింహం మండల కేంద్రంలో శ్రీ రావుల మల్లికార్జున స్వామి ఆలయ మండపంలో నెలకొల్పిన దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో పంటలు బాగా పండి సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి సింగిల్ విండో చైర్మన్ కొంజర్ల వెంకటయ్య, మాజీ ఎంపీపీ రమాదేవి, పెద్దపల్లి మాజీ ఎంపీపీ సునీత, మాజీ ఎంపిటిసి దండే వెంకటేశ్వర్లు, నాయకులు రాజేందర్, రాంగోపాల్ రెడ్డి, కొమ్మ పోచాలు, కొమ్మ ఐలయ్య, మాజీ ఉప సర్పంచ్ కొప్పుల మహేష్, అడువాల తిరుపతి, సుద్దాల మాజీ సర్పంచ్ కొమ్ము సంపత్, నాయకులు బండి స్వామి, మల్లెత్తుల కనుకయ్య, బండి రాజయ్య, మెండే మల్లేశం, మేర శ్రీనివాస్, బాణాల కొమురయ్య, మల్లెత్తుల నర్సయ్య, నాడెం శ్రీధర్, వేంసాని కొమురయ్య, అమ్మవారి దీక్ష పరులు, దుర్గామాత కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## మాదిగల ద్రోహి సిఎం రేవంత్ రెడ్డి

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగాల భర్తీతో మాదిగలకు అన్యాయం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి మాదిగల ద్రోహి అని ఎమ్మార్పీఎస్ నాయకులు మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ అమలులో జాప్యాన్ని నిరసిస్తూ పెద్దపల్లి బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం ముందు బుధవారం నిరసన ఆందోళన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తక్షణమే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ప్రత్యేక ఆర్డినెన్సు ద్వారా మాదిగలకు రిజర్వేషన్ ఫలాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు మంథని చందు మాదిగ, మంథని సామ్యెల్ మాదిగ, అంబాల రాజేందర్, పొట్ల రమేష్ మాదిగ, అంబాల నరేష్, మామిడిపల్లి బాపయ్య, సిరిసిల్ల శంకర్, పల్లె బాపు మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## నలబై ఒకటి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**సూర్య ముత్తారం**



ముత్తారం మండలంలోని వివిధ గ్రామాలలో సీఎంఆర్ఎఫ్ నలభై ఒక చెక్కులను పంపిణీ చేశారు. మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఇంటింటికి వెళ్లి నలభై ఒక చెక్కులను లబ్ధిదారులకు అందజేత. ముత్తారం మండలానికి నలభై ఒక చెక్కులను నేరుగా లబ్ధిదారి చేతికి అందజేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి ముత్తారం మండలానికి మచ్చుపేట, ముత్తారం, హరిపురం, పారుపల్లి, కేశనపల్లి, అడవి శ్రీరాంపూర్, పోతారం, ఓడేడు, లక్కారం, ఖమ్మంపల్లి, మైదంబండ, రామకృష్ణాపూర్, సీతంపేట నలభై ఒకటి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు చేసి ఇప్పించారు. దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రభుత్వ వ్యక్తిగత సహాయకులు ఆకుల చంద్రశేఖర్ గ్రామాలలోని లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి చెక్కులు అందజేశారు.

## ఘనంగా కాన్షీరాం వర్ధంతి

**సూర్య పెద్దపల్లి**



బడుగు బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన కాన్షీరామ్18వ వర్ధంతి వేడుకలనుమాదిగ శక్తి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కల్లెపల్లి రవి ఆధ్వర్యంలో పెద్దపల్లి జండా కూడలిలో ఘనంగా నిర్వహించారు. కాన్షీరాం విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు దాసరి ఉష, మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు బొంకూరీ సురేందర్ మాదిగ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాడూరి శ్రీమాన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాళ్ళపల్లి అంజయ్య, పల్లె రాజేందర్, బొంకూరి భూమయ్య, కుమ్మరి కాంతయ్య, ఆముదాల అరుణ, మచ్చ రాహుల్, చిన్నూ జనగామ, కలవల హనీ, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

## - బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ జిల్లాలో బిజెపి సభ్యత్వ నమోదును కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి భారతీయ జనతా యువ మోర్చా శ్రేణులు తగిన కృషి చేయాలని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్‌లోని కమాన్ వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో జరిగిన బిజెపి మెంబర్‌షిప్ డ్రైవ్ ప్రోగ్రాం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మెంబర్షిప్ డ్రైవ్ కోసం రాష్ట్ర బిజెపి టార్గెట్ పెట్టుకుందని, ఆ టార్గెట్‌ను రీచ్ కావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బిజెపి మెంబర్షిప్ డ్రైవ్‌లో యువతను



భాగస్వామ్యం చేయడానికి బీజేవైఎం ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ముఖ్యంగా దేశంలో , ప్రపంచంలోనే అతిపెద్ద కార్యకర్తలు కలిగిన పార్టీగాబిజెపిఅవతరించిందన్నారు. బిజెపి సిద్ధాంతం పట్ల, బిజెపి పాలనపట్ల అన్ని వర్గాల ప్రజలు, మహిళలు, యువకులు ఎంతో విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. బిజెపి కుటుంబంలో చేరడానికి అనేకమంది ఉత్సాహం చూపుతున్నారని, రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో లక్షల మంది నూతన సభ్యత్వం తీసుకున్నారన్నారు. ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా బలమైన పార్టీగా నేడు భారతీయ జనతా పార్టీ ఉందని, ఇదంతా కార్యకర్తల కార్యకర్తల సమిష్టి కృషితోనే జరిగిందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సభ్యత్వ నమోదు ప్రోగ్రామ్‌ను విజయవంతం చేయాల్సిన బాధ్యత బూత్ స్థాయి కార్యకర్త మొదలుకొని గ్రామ మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకుల వరకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్, తరుణ్, కోశాధికారి యోగిరాజ్,రాష్ట్ర కార్యదర్శి యువ క్రాంతి,రాష్ట్ర నాయకులు సంతోష్,అవినాష్,జిల్లా నాయకులు శ్రీరాములు శ్రీకాంత్,అజయ్ దేవరకొండ తదితరులు పాల్గొన్నారు.

# పండుగ ఏర్పాట్ల కోసం కార్యదర్శుల తిప్పలు

## - ప్రత్యేక నిధులు ఇవ్వని ప్రభుత్వం

**సూర్య, హుజురాబాద్**

బతుకమ్మ, దసరా పండుగ వేడుకల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించక పోవడంతో గ్రామాల్లో పండగ ఏర్పాట్లు చేయడానికి కార్యదర్శులు తిప్పలు పడుతున్నారు. తెలంగాణ ప్రాంతంలో ప్రజలు అత్యంత భక్తి భావంతో, సాంప్రదాయ బద్ధంగా జరుపుకునే సద్దుల బతుకమ్మ, దసరా పండుగ వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీ. బతుకమ్మ పండుగ వేడుకల కోసం ఆయా గ్రామాల్లో గ్రామపంచాయతీ విద్యుత్ దీపాలు ఏర్పాటు, వీధులను శుభ్రం చేయడం, బతుకమ్మ పండుగ వేడుకలు జరిగే ప్రాంతాన్ని చదును చేయడం, ప్రత్యేక ఏర్పాట్లను చేయడం లాంటివి కార్యదర్శులు చేయాల్సి ఉంటుంది. దసరా పండుగ నిర్వహణ సైతం ఏర్పాట్లు చేయడం, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం చాలా ముఖ్యం. ఈ రెండు పండుగలు దగ్గర దగ్గరగా ఉండడం తప్పనిసరి పరిస్థితుల్లో ఏర్పాట్లు చేయాల్సి రావడం, ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేయక పోవడంతో ఇతర నిధులను, సాధారణ నిధులను ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఈ రెండు పండుగలు చాలా ముఖ్యం కావడం గ్రామపంచాయతీలో, మున్సిపాలిటీల్లో పనిచేసే కార్మికులకు తప్పనిసరిగా వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం ప్రతి ఏడాది పండుగల నిర్వహణ కోసం కొంత ప్రత్యేక నిధులు మంజూరు చేసినప్పటికీ పెద్ద పెద్ద గ్రామపంచాయతీలో ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోక ఎక్కువ ఖర్చు అవుతాయి. వాటిని సర్దుబాటు చేయడం కార్యదర్శులకు తలకు మించిన భారమవుతుంది. ప్రస్తుతం గ్రామాలలో సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో ప్రభుత్వ అధికారుల పాలన నడుస్తుంది. పండుగ ఏర్పాట్లలో కార్యదర్శిలు, అధికారులు నిమగ్నమై ఉన్నారు. అధికంగా ఖర్చు చేస్తే వాటిని సర్దుబాటు చేయడం ఎలా? ఖర్చు చేయకపోతే ప్రజలతో ఇబ్బంది. ప్రజల మనోభావాలు దెబ్బతీయకుండా కార్యదర్శులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మొత్తానికి పండగ ఏర్పాట్లను అధిగమించడానికి కార్యదర్శులకు నానా అవస్థలు పడుతున్నారు.

## పిఆర్టీయు రాష్ట్ర అసోసియేట్ కార్యదర్శిగా రాములు

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మ్యాక రాములు పిఆర్టీయు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పిఆర్టీయు కార్యవర్గ ఎన్నికల సందర్భంగా రాములుకు ఈ పదవి లభించింది. 1998 నుండి ఉపాధ్యాయుడుగా, పిఆర్టియు నాయకుడిగా వివిధ హోదాల్లో పని చేసిన రాములుకు ఈ పదవి రావడం పట్ల హుజురాబాద్ మండల పిఆర్టీయు నాయకులు మాధవ రావు, భాగ్యరేఖలు హర్షం వ్యక్తం చేశారు.

## దేశాభివృద్ధికి పట్టుకొమ్మలు పల్లె సీమలు

### - సూడా నిధుల ద్వారా వీధి దీపాలను ప్రారంభించిన సూడా చైర్మన్, ఎమ్మెల్యే

**సూర్య గన్నేరువరం**



కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామంలో శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా మంజూరైన సుమారు 20 లక్షల రూపాయల నిధులతో ఏర్పాటు చేసిన బస్టాండ్ నుండి మాదాపూర్ గ్రామం వరకు ఏర్పాటుచేసిన వీధి దీపాలను హైమాస్ట్ లైట్లు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి కూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ప్రారంభించారు. దేశాభివృద్ధికి పట్టుకొమ్మలు పల్లెలని పల్లెలను అభివృద్ధి చేసుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల కలుగునంగా పనిచేస్తుందని కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ద్వారా పెద్ద ఎత్తున సుడా పరిధిలోని గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు, పాల్గొన్నారు.

## కరీంనగర్ బస్‌స్టేషన్లో ఘనంగా బతుకమ్మ పండగ సంబరాలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



బతుకమ్మ పండగను పురస్కరించుకొని డా.బి.ఆర్.అంబేడ్కర్ బస్ స్టేషన్, కరీంనగర్లో రీజనల్ మేనేజర్ ఎన్.సుచరిత ఆధ్వర్యములో నిర్వహించబడిన బతుకమ్మ పండగ సంబరాలలో రీజనల్ మేనేజర్తో పాటు,కరీంనగర్-1 డిపో మేనేజర్ ఐ. విజయమాధురి, కరీంనగర్-2 డిపో ట్రాఫిక్ ఇంఛార్జి పి. విజయలక్ష్మి, వెల్ఫేర్ బోర్డు మెంబర్లు పి.సుజాత, జి. లక్ష్మి, వి.కవిత, దివ్య, కె.అనిత, శారద,కరీంనగర్-1,2 డిపోలకు చెందిన మహిళా ఉద్యోగులు, బస్ స్టేషన్ సిబ్బంది బతుకమ్మ సండగ సంబరాలలో పాల్గొన్నారు. ఈ బతుకమ్మ పండగ సంబరాలకు డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్. భూపతిరెడ్డి, కరీంనగర్ బస్ స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సురేశ్,పర్సనల్ ఆఫీసర్ ఎం.చంద్రయ్య హాజరయ్యారు.

## అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

**సూర్య గొల్లపల్లి**



గొల్లపల్లి మండలకేంద్రంలో దేవి నవ రాత్రుల సందర్భంగా రామాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని బుధవారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రంలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

**సూర్య మల్లాపూర్**



బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ వాహిని ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో ముందస్తు బతుకమ్మ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మ ను అలంకరించి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషియన్ ఉమ, స్టాఫ్ నర్స్ సుమ, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

## శరన్నవరాత్రి ఉత్సవాలలో పాల్గొన్న ఆది

**సూర్య మేడిపల్లి**



శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం రోజు మేడిపల్లి మండల కేంద్రములోని దుర్గా మాత అమ్మవారిని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గా మాత అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,పాడిపంటలతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకొన్నట్లు తెలిపారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా అన్నిగ్రామాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది జరుగకుంగ చూడాలని,అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులు ఎంపిడిఓ పద్మావతి, ఎంపీవో నీరజ,పంచాయతీ కార్యదర్శి సంతోష్ రావులను కోరారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ ఏనుగు రమేష్ రెడ్డి,బీమారం మండల ప్రెసిడెంట్ సింగిరెడ్డి నరేష్ రెడ్డిలు, ప్రధాన కార్యదర్శి చేపూరీ నాగరాజు,నాయకులు పాల్గొన్నారు.

## డిఎస్సీలో సత్తా చాటిన ఎండపల్లి యువకుడు

### - హర్షం వ్యక్తం చేసిన గ్రామస్థులు

**సూర్య ఎండపల్లి**



మండల కేంద్రంలోని డిఎస్సిలో బొడ్డు ప్రవీణ్ తండ్రి లింగయ్య స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచాడు, కష్ట పడితే సాధ్యం కానిది లేదని నిరూపించాడు, గతంలో కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ప్రయత్నించి త్రుటిలో తప్పిన కూడా ప్రభుత్వ కొలువు కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూసి డీఎస్సీలో జిల్లాలో పదవ ర్యాంకు సంపాదించి సోషల్ స్కూల్ అసిస్టెంట్ గా ఉద్యోగం సాధించిన బొడ్డు ప్రవీణ్.అటు ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు,అభిమానులు, సన్నిహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

## కోడం అమర్నాథ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ

**సూర్య రాజన్న సిరిసిల్ల**



సిరిసిల్ల పట్టణానికి చెందిన కోడం అమర్నాథ్ దంపతుల నేతృత్వంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. దేవీ శరన్నవ రాత్రుల సందర్భంగా సిరిసిల్ల పట్టణం గాంధీ చౌక్ లోని తుల్జా భవాని సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబా భవాని మండపంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారు సరస్వతీదేవి రూపంలో కొలువై భక్తుల పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారవేత్త, కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కోడం అమర్నాథ్ నేతృత్వంలో అంబా భవాని భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. అంతకుముందు అంబా భవాని మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అమర్నాథ్ దంపతులు పూజారుల ఆశీర్వాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆడపు రవీందర్, వడ్డేపల్లి బంగారి, వడ్డేపల్లి మారుతి, సాప పురుషోత్తం, తీగల రాజు గౌడ్, రవి, సాయన్నలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## ఆర్టీసీ డిపోలో బతుకమ్మ సంబరాలు

**సూర్య సిరిసిల్ల టౌన్**



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సిరిసిల్ల డిపోలో బతుకమ్మ పండుగ పురస్కరించుకొని డిపో మేనేజర్ ఏ.ప్రకాష్ రావు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో సూపరేండెంట్ నక్క శ్రీనివాస్, వేణు, హర్భజన్ సింగ్, రాజేశం, రాంరెడ్డి, హెడ్ గార్డ్ రాజేందర్ రెడ్డి, శ్రీనివాస్, భాస్కర్, మహిళా ఉద్యోగినులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు చల్మెడ పరామర్శ

**సూర్య చందుర్తి**



చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్త కోరే మల్లేశం భార్య కోరే క్యాతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను, అలాగే చింతపల్లి మునీందర్ కుమారుడు కౌశిక్ కు ఇటీవల ప్రమాదంలో కాలుకు గాయం కాగా వారిని, అలాగే కార్యకర్త గసికంటి రామస్వామి అనారోగ్యంతో బాధపడుతుండగా వారిని బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అయన వెంట మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, ప్యాక్స్ చైర్మన్ కిషన్ రావు, రమేష్ రావు, బాలు లక్ష్మణ్, మల్యాల గంగ నరసయ్య, రామస్వామి,దేవయ్య,రవి, సత్తయ్య తదితరులు ఉన్నారు.

## దుర్గామాత అమ్మవారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు

**సూర్య చందుర్తి**

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చందుర్తి మండలం రామన్నపేట గ్రామంలో నెలకొల్పిన దుర్గ మాత అమ్మవారి మండపం వద్ద కాంగ్రెస్ సీనియర్ నాయకులు భీమరాజు కనకరాజు బుధవారం రోజున అన్నదాన కార్యక్రమమును ఏర్పాటు చేయగా అట్టి కార్యక్రమానికి హాజరైన ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షములు మండల ప్రజలపై రేవంత్ రెడ్డి సర్కారుపై ఉండి ప్రజలను ప్రభుత్వాన్ని చల్లగా చూడాలని



వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి కార్యక్రమాన్ని నిర్వహించిన కనకరాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, కాంగ్రెస్ నాయకులు తాజా మాజీ జెడ్పిటిసి నాగం కుమార్, గొట్టె ప్రభాకర్ ముకుంద రెడ్డి, డి.శ్రీనివాస్ రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తిప్పని నరసయ్య, యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా కాన్షిరాం 18 వ వర్ధంతి

**సూర్య బోయినపల్లి**



బోయినపల్లి మండల కేంద్రంలో బహుజన బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్సి రాం 18వ వర్ధంతిని బోయిన్పల్లి మండల కేంద్రంలో మాజీ మండల కన్వీనర్ పెగ్గెర్ల మహేందర్ ఆధ్వర్యంలో జరుగగా దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నల్లాల శ్రీనివాస్ జిల్లా ఇన్చార్జి అక్కి బాలకిషన్ అసెంబ్లీ ఇంచార్జ్ కాంపెల్లి రాజులతో కలిసి హాజరైన ఆయన మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే మనమిచ్చే ఘనమైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీని బలోపేతం చేసి అన్ని స్థానాలలో పోటీ చేపిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ దేశంలో బహుజనులకు ఉన్న ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ నే అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో బిఎస్పీ సీనియర్ నాయకులు మాంకాళి తిరుపతి కరీంనగర్ అసెంబ్లీ అధ్యక్షులు ఉల్లేందుల మహేష్, సీనియర్ నాయకులు కట్ట రాజయ్య,పెగ్గెర్ల శేఖర్, భాస్కర్, కన్నం రాజు, మైనారిటీ నాయకుడు షారుఖ్, అలవాలా అంజయ్య, కోరేపు మధు, ఏడపెల్లి రాజు, కన్నం అనిల్, తదితరులు పాల్గొన్నారు..

## వ్యవసాయ మోటార్ చోరీ

**సూర్య గంభీరావుపేట**



గంభీరావుపేట మండలం నర్మాల గ్రామ శివారులోని నాయికమ్మ గుడి సమీపంలో మానేరు వాగు వద్ద మాల కులస్తులకు చెందిన వ్యవసాయ మోటర్ 5హెచ్ పి చోరీకి గురైంది. సోమవారం రోజున వాగులోంచి వరి పొలానికి నీటిని అందించారు. మంగళవారం ఉదయం వెళ్లి చూసేసరికి మోటర్ స్టార్టర్ కేబుల్ కనిపించడం లేదని రైతులు తెలిపారు. దాదాపు 40 కిలోల కంటే ఎక్కువ బరువు ఉన్న మోటర్ ను ఎత్తుకెళ్లడం వెనుక ఇద్దరు ముగ్గురు హస్తం ఉందని రైతుల అనుమానిస్తున్నారు.

## దుర్గామాత పూజలో పాల్గొన్న మాజీ సర్పంచ్

**సూర్య బోయినపల్లి**



బోయిన్పల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో బుధవారం రామేశ్వరం లో ఉన్న దుర్గామాత పూజలో పాల్గొనడం జరిగింది. గ్రామంలోని తాజా మాజీ సర్పంచ్ బూర్గుల నందయ్య, వార్డ్ సభ్యులు, పాలోజి రాజేంద్ర ప్రసాద్, దుర్గామాత స్వాములు నల్లాల చరణ్, పెంటల శివ, మల్లాల సాయి శశాంక్, ఇటికాల హరీష్, కరుణాకర్, తీర్థాల సదయ్య, నల్లాల అరుణ్, గ్రామంలోని మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మద్యపాన నిషేధానికి గ్రామస్తుల తీర్మానం

**- తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేత**

**సూర్య గంభీరావుపేట**



గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామంలో బుధవారం మద్యపాన నిషేధానికి గ్రామస్తులు గ్రామసభ ద్వారా నిర్ణయం తీసుకున్నారు. గ్రామం లో మద్యం విక్రయించరాదని గ్రామ ప్రజలందరూ సమావేశమై తీర్మానం చేశారు. ఎలాంటి మధ్యాన్ని విక్రయించకుండా సహకరించాలని పిలుపునిచ్చారు. మద్యం విచ్చలవిడిగా అమ్మకాలతో రోగాల బారిన పడి ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించి తాము తీసుకున్న నిర్ణయానికి సహకరించాలని తహసిల్దార్ భూపతికి గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గున్నాల బాలాగౌడ్, మాజీ సర్పంచ్ చెవుల మల్లేశం యాదవ్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కోలా రాజు, నాయకులు నరేష్, నర్సింలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గడి మైసమ్మ ఆలయానికి "మాజీ సర్పంచ్" షెడ్డు నిర్మాణం

**సూర్య. ఇల్లంతకుంట**




మండలంలోని పెద్ద లింగాపూర్ గ్రామంలోని గడి మైసమ్మకు ఆలయంకు తాజా మాజీ సర్పంచ్ గోడిశేల జితేందర్ గౌడ్ స్వంత ఖర్చులతో షెడ్డు నిర్మాణం చేశారు. బుధవారం ఆలయానికి షెడ్డు పనులు పూర్తి కాగానే గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు.గతంలో ఇచ్చిన హామీ మేరకు గత వారం రోజుల క్రితం షెడ్డు నిర్మానికి భూమి పూజా చేసి పనులు ప్రారంభం చేసి, వారం లోపే పూర్తి చేయడం పట్ల జితేందర్ గౌడ్‌ను నాయకులు, గ్రామస్థులు, అభినందించారు. ఈ కార్యక్రమంలో కులసంఘాల పెద్దలు, నాయకులు, గ్రామస్థులు వున్నారు.

## నేడు సద్దుల బతుకమ్మ వేడుకలు

**- శుభాకాంక్షలు తెలిపిన మాజీ సర్పంచ్**

**సూర్యబోయినపల్లి**



తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగనీ తడగొండ మాజీ సర్పంచ్ చిందం రమేష్ అన్నారు.సహజంగా ఎక్కడైనా దేవుళ్ళను పూల తో పూజిస్తారు, కానీ పూలనే దేవత గా పూజించడం ఈ బతుకమ్మ పండుగలో ఉంటుంది. ప్రపంచంలో పూలను పూజించే సంస్కృతి కేవలం తెలంగాణలో మాత్రమే ఉంది. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ. మన తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నిర్వహించుకుంటారని ఈ సందర్భంగా మహిళలకు గ్రామ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపిన మాజీ సర్పంచ్ చిందం రమేష్. మహిళలు, ప్రజలు, యువతీ యువకులు, పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సరస్వతి పూజ

**సూర్య బోయినపల్లి**



బోయిన్పల్లి మండలం గ్రామ విలాసాగర్‌లోని శ్రీ శ్రీ త్రిలింగ సంగమేశ్వర స్వామి దేవస్థానంలో దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సరస్వతి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో పిల్లలకు బుక్స్, పలకలు, పెన్నులు పంపిణీ చేస్తాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజి డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి హాజరై దుర్గామాతకు, స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత కమిటీ సభ్యులు స్వాములు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.పబ్బ నరేష్ గౌడ్, బండారి రాములు, బూర ఉమామహేశ్వర్, దమ్మ వెంకటరమణ, అంజయ్య, ఉపేందర్, అనిల్ గౌడ్, స్వాములు, నరహరి, మనోజ్, హరీష్, చల్ల లక్ష్మీనారాయణ, కనకయ్య, మురళి, రమేష్ పాల్గొన్నారు.

## బండిని కలిసిన కృష్ణకాంత్ యాదవ్

**సూర్య గంభీరావుపేట**



గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామంలో శిధిలవస్థలో ఉన్న హనుమాన్ దేవాలయ నిర్మాణం, గ్రామంలోని కుల సంఘాల భవన నిర్మాణాల కోసం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కృష్ణ కాంత్ యాదవ్ గ్రామ ప్రజలతో కలిసి కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను కరీంనగర్‌లో కలిసి వినతి పత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి గ్రామ దేవాలయం విషయంలో సంపూర్ణ సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే అన్ని కుల సంఘాలకు భవన నిర్మాణాలు వెంటనే చేపట్టే విధంగా త్వరలో ప్రొసిడింగ్ పత్రాలను అందిస్తానని తెలిపినట్లు కృష్ణ కాంత్ యాదవ్ తెలిపారు. వీరి వెంట కుల సంఘాల అధ్యక్షులు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దసరా ఉత్సవాలకు ముస్తాబైన సార్గమ్మ దేవాలయం

**సూర్య చందుర్తి**



చందుర్తి మండల కేంద్రంలోని స్థానిక రాములవారి మండపం వద్ద పురాతన కాలము నుండి ఒక మూలన సురు రౌతులతో ఏర్పాటు చేసిన గుడిలో అమ్మ వారి ప్రతిమను పెట్టి దసరా రోజున సార్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి గుమ్మడికాయ ను నైవేద్యంగా సమర్పించి అక్కడినుండి ఉత్సవాలు ప్రారంభించి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జమ్మి కొట్టే కార్యక్రమంతో దసరా ఉత్సవాలను ముగించేవాళ్లు అయితే స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులు పులి సత్యం ఆధ్వర్యంలో గ్రామ కుల సంఘాల సహకారంతో చిన్న గుడి నిర్మాణములు చేపట్టి స్థానిక పురగిరి క్షత్రియ పెరిక సంఘం అమ్మవారి విగ్రహాన్ని తీసు కురాగా గ్రామంలోని అన్ని కుల సంఘాల సహకారంతో బుధవారం రోజు న బైండ్ల వారుచే పూజలు నిర్వహించి అమ్మవారిని పునర్ ప్రతిష్టించారు. దసరా ఉత్సవాలకు అమ్మవారిని తోరణాలతో పూలతో అలంకరించి ముస్తా బ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని అన్ని కుల సంఘాల నాయకు లు ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమాత మండపాల వద్ద చల్మెడ ప్రత్యేక పూజలు

**సూర్య చందుర్తి**



చందుర్తి మండలంలోని మర్రిగడ్డ,చందుర్తి, లింగంపేట గ్రామాలలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాల వద్ద బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్, సింగల్ విండో చైర్మన్లు కిషన్ రావు, తిప్పని శ్రీనివాస్, సీనియర్ నాయకులు డప్పుల అశోక్, చిలుక పెంటయ్య, రమేష్, ఈర్లపల్లి రాజు, రమేష్ రావు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# మద్దతు ధరకు వరి కొనుగోలు

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష - కోనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పన**

**- ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ లో నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను తూచా తప్పకుండా పాటిస్తూ మద్దతు ధర పై వరి పంట కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధ వారం ధాన్యం కొనుగోలు సన్నాహక సమావే శంలో అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2024 లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చివరి గింజ వరకు నాణ్యమైన వడ్లను మద్దతు ధరపై కొనుగోలు చేసి 48 గంటల్లో చెల్లింపులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసే అవకాశం ఉందని, దీనికి తగ్గట్టుగానే అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు.కొనుగోలు కేంద్రాల్లో నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు గల వరి పంటను మాత్రమే కొనుగోలు చేయాలని, ఎవరి దగ్గర నుంచి ఎటువంటి ఒత్తిడి వచ్చిన నాణ్యతలేని పంట కొనుగోలు చేయవద్దని కలెక్టర్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జి లకు సూచించారు. ప్రతిరోజు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఓపిఎంఎస్ లో ట్యాబ్ ఎంట్రీ పూర్తి కావాలని అన్నారు. కోనుగోలు చేసిన పంటకు చెల్లింపులు రైతులకు 48 గంటల్లో జరరుగుతాయని అన్నారు. ప్రతి ధాన్యం కొను గోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్, తేమ యంత్రాలు, వెయింగ్ యంత్రాలు గన్ని బ్యాగులు.. మొదలకు సామాగ్రి అందుబాటులో ఉందో లేదో అక్టోబర్ 16 నాటికి నివేదిక అందించాలని కలెక్టర్ సూచించారు. మార్కెటింగ్ అధికారితో సమయం చేసుకుంటూ అవసరమైన సామాగ్రి కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు.వాతావరణ శాఖ సూచనలు గమనించాలని, ఈ అంశాన్ని రైతులకు చేరేలా వ్యవసాయ విస్తరణ అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. క్రాప్ బుకింగ్ ప్రకారం సన్న వడ్లు వేసిన రైతుల వివరాలు అందించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లు, దొడ్డు వడ్లకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సన్న వడ్లు సంచులకు రెడ్ ట్యాగ్ వేయాలని అన్నారు. అక్టోబర్ 15 నుంచి 20 వరకు ప్రతి మండలా నికి ముందుగా 2 కొనుగోలు కేంద్రాలు ప్రారంభి ంచాలని, పంట దిగుబడుకు ప్రకారం అవసర మైన కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంబి ంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికా రులకు సూచించారు. పంట కోతలు జరుగు తున్న నేపథ్యంలో హార్వెస్టర్లతో కోతల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సమావేశం నిర్వహిం చాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత గన్ని సంచులకు ట్యాగ్, సెంటర్ నెంబర్ వేయాలని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు త్వరితగతిన తరలించాలని లేనిపక్షంలో రవాణా కాంట్రాక్టర్లకు కోత విధించడం జరుగు తుందని , ఈ అంశాన్ని స్పష్టంగా అమలు చేయాలని కలెక్టర్ రవాణా శాఖ అధికారి ఆదేశించారు.రైస్ మిల్లులో ఎట్టి పరిస్థితుల్లోనూ తాలు కట్ చేయడానికి వీలు లేదని, నాణ్యతను కొనుగోలు కేంద్రాల దగ్గరే పరిశీలించి పంపాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్ మిల్లుల వద్ద ఎక్కడ హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేయింగ్ యంత్రాలను పరీక్షించాలని కలెక్టర్ తెలిపారు.



కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే షెడ్యూల్ ప్రకారం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వత్తులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, రైతులకు త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, టెంట్, కుర్చీలు వేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కేటాయించిన గన్నీ బ్యాగులను నాణ్యత తీసుకునే ముందే పరిశీలించాలని అదనపు కలెక్టర్ సూచించారు.కోనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర హామాలీలు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. వరి పంట కొనుగోలు సమయంలో వరి రకం (సన్న, దొడ్డు), తేమ శాతం, శుభ్రం చేశారా వంటి అంశాలను పరిశీలించాలని అన్నారు. వరి పంట నాణ్యత ప్రమాణాలు మనం రిజిస్టర్ లో స్పష్టంగా రాసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, డీఎం మార్కెటింగ్ శ్రీకాంత్ , జిల్లా సహకార అధికారి శ్రీమాల, అగ్రికల్చర్ ఏ.ఓ.లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**- 7 వ రోజు దుర్గమ్మ శ్రీ సరస్వతి దేవిగా ( కాళరాత్రి ) దర్శనం**

**- ఆలయ మాడవీధుల్లో అమ్మవారి( దుర్గమ్మ) పల్లకిసేవ ఊరేగింపు**

**- అమ్మవారి పల్లకిని మోసిన కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

కరీంనగర్ మహాశక్తి ఆలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవార్ల దర్శనం కోసం భక్తులు, భవానీ స్వాములు ఆలయానికి పోటె త్తారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా భక్తుల తాకిడితో ఆలయం ప్రాంగణం కిక్కిరిసి పోయింది. భవానీ మాత శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం దద్దరిల్లిపోయింది. అమ్మవారి దర్శనం కోసం ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు మంగళవారం( 7 వ రోజు) శ్రీ సరస్వతి దేవిగా ( కాళరాత్రి ) దర్శనమిచ్చారు. అమ్మవార్లను దీపాలు , ప్రత్యేక పూలతో అలంకరించారు. భవానీ స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవార్లను శరణు వేడారు.కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయత్రం నిర్వహించిన అమ్మవారి పల్లకి సేవలో పాల్గొన్నారు.



# తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ

**- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి - ఘనంగా బతుకమ్మ సంబరాలు**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబం బతుకమ్మ పండుగ అని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. బుధవారం సాయంత్రం మహాత్మా జ్యోతిబా పూలె మైదానంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. మహిళా అధికారులు, సిబ్బంది తాము రూపొందించిన బతుకమ్మల్ని ఒకచోట చేర్చి ఆట, పాటలతో సందడి చేశారు. అనంతరం మహిళలతో కలిసి జిల్లా కలెక్టర్ బతుకమ్మ పాటలకు ఆడిపాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ బతుకమ్మ ప్రాముఖ్యతను



వివరించారు. పూలనే పూజించి దేవతలుగాకొలుస్తున్న ఏకైక గొప్ప పండుగ బతుకమ్మ అని అన్నారు. మన పండుగ, మన సంస్కృతి ఆడపడుచుల ఔన్నత్యానికి సూచిక అన్నారు.ప్రపంచవ్యాప్తంగా పూలను పూజించి ప్రకృతిని ప్రేమించే ఏకైక పండుగ బతుకమ్మ అని తెలిపారు. అనంతరం బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దిన శాఖలకు బహుమతులు ప్రదానం చేశారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, మెప్మా, నగరపాలక సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, రెవిన్యూ శాఖ, సిపిఓ, జెడ్పి సహా పలు శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు,అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీ కిరణ్, ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, టీఎన్జీవో నాయకులు, జిల్లా అధికారులు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# దుద్దెనపల్లిలో దారుణం

# తమ్ముడిని హతమార్చిన అన్న

**- మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి**

**- విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్న హుజురాబాద్ ఏసిపి శ్రీనివాస్ జి**





**సూర్య సైదాపూర్**

మద్యం మత్తులో అర్ధరాత్రి అన్న తమ్ముడు ఇంట్లో గోడువ పడిన ఘటనలో తమ్ముడిని అన్న దారుణ ంగా హతమార్చిన సంఘటన కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లి గ్రామంలో బుధవారం సంచలనంగా మారింది. హుజురాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివారాల ప్రకారం... దుద్దెనపల్లి గ్రామానికి చెందిన కుందెల్ల రాజయ్య ప్రేమలతలకు ఇద్దరు కుమారులు, ఒక్క కుతురు ఉన్నారు.కుతురు వివాహాం చేయగా ఇద్దరు కుమారులు ఇంటి వద్దే వ్యవసాయంతోపాటు, కూలీ పనులు చేస్తు జీవిస్తున్నారు. పెద్ద కుమారుడు కుందేల్ల కుమార స్వామి వివాహాం చేసుకోని పక్క గదుల్లో ఉంటున్నారు.మృతుడు చంద్రయ్య(30)కి ఇంకా వివాహం కలేదు.వీరి తండ్రి రాజయ్య గత 10సంవత్సరాలుగా సౌదీకి ఉపాధి నిమిత్తం వెళ్తు వస్తున్నాడు.ఇదే తరుణంలో తండ్రి ఇంటికి పంపించే డబ్బుల విషయంలో,వ్యవసాయ పోలం విషయంలో తరుచు ఇద్దరికి గోడవలు జరుగుతున్నాయి.పలు జల్సాలకు అలువాటు పడి అర్ధరాత్రి మృతుడు చంద్రయ్య మద్యం మత్తులో ఇంటికి వచ్చి అన్న కుమారస్వామితోపాటు తల్లితో గొడవ పడి అక్కడే ఉన్న రాడ్ తో తన అన్న కుమారస్వామిని కోట్టేందుకు వెళ్లాడు.అక్కడ ఇద్దరు గడవ పడగా అదే రాడ్ తో మృతుడి తలపై అన్న కుమారస్వామి విచక్షణ రహితంగా కోట్టాడు.దీంతో తల నుజ్జునుజ్జు అయ్యింది. వెంటనే కుమారస్వామి సైదాపూర్ పోలీష్ స్టేషన్లో పోలీసులకు లోంగిపోయినట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న హుజురాబాద్ టౌన్ సీఐ తిరుమల్, ఎస్సై తిరుపతి తమ సిబ్బందితో హత్యజరిగిన ప్రదేశానికి వెళ్లి ప్రాథమిక వివారాలు తీసుకోని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.హత్యకు దారితీసిన విషయాలపై పూర్తి స్థాయిలో విచారణ చేసి త్వరలోనే వివారాలు వెల్లడిస్తామని హుజురాబాద్ ఏసీపీ శ్రీనివాస్ జీ సైదాపూర్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సమావేశంలో హుజురాబాద్ టౌన్ సీఐ తిరుమాల్,ఎస్సై తిరుపతిలు ఉన్నారు.

# యువతకు, ఔత్సహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ,షార్ట్ ఫిలిమ్ పోటీలకు ఆహ్వానం

**- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



శాంతి భద్రతల, సమాజ రక్షణలో తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా పెట్టి, పోరాడి వీరమరణం పొందిన అమర పోలీసుల జ్ఞాపకార్థం అక్టోబర్ 21 నాడు జరుగు " పోలీస్ ఫ్లాగ్ డే " సందర్భంగా పోలీస్ రిలేటెడ్ అంశం మీద ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలిం తీయడానికి జిల్లాలో ఆసక్తి గల యువతక ఔత్సహిక ఫోటోగ్రాఫర్లు ముందుకు రావాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే మూడు ఫోటోలు, తక్కువ నిడివి మూడు నిమిషాలు గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 20వ నాడు సాయంత్రం వరకు మీకు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో అందజేయాలన్నారు. ఇట్టి షార్ట్ ఫిలిం 3 నిమిషాలు మించకూడదు. 10 %ఇ% 8 సైజ్ ఫోటోలను ,షార్ట్ ఫిలింను సిడిలో లేదా పెన్ డ్రైవ్ లో మీ యెక్క పూర్తి వివరాలతో అందజేయాలని, జిల్లా స్థాయిలో సెలెక్ట్ అయిన మూడు షార్ట్ ఫిలింలను స్టేట్ కాంపిటేషన్ గురించి డీజీపీ ఆఫీస్ హైదరాబాదుకు పంపించడం జరుగుతుందనీ ఎస్పీ వెల్లడించారు.

# క్రీడలతో ఒత్తిడి దూరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

## -గంజాయి రహిత తెలంగాణ రాష్ట్రంగా తయారు చేయడమే లక్ష్యంగా చర్యలు

## -2036 ఒలింపిక్ పతకాల సాధనే లక్ష్యంగా స్పోర్ట్స్ పాలసీ రూపకల్పన

## -పోలీస్ స్పోర్ట్స్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, జిల్లా కలెక్టర్

**సూర్య రాజన్న సిరిసిల్ల**

ప్రశాంతమైన మంచి భద్రతతో కూడిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడంలో పోలీసు శాఖ పాత్ర ఎనలేనిదని , ఇటువంటి పోలీసు శాఖకు క్రీడా పోటీల నిర్వహణ ద్వారా వారి ఒత్తిడి కొంత తగ్గుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం సిరిసిల్ల లోని అంబేద్కర్ స్టేడియంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రెండవ పోలీస్ వార్షిక క్రీడా సంబరాలు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాబోయే బతుకమ్మ దసరా పండుగ సందర్భంగా మహిళలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. క్రీడా పోటీల నిర్వహణ వల్ల మానసిక ఉల్లాసంతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలతో స్నేహభావం పెరగడానికి ఉపయోగపడుతుందని అన్నారు. క్రీడలు అంటే ప్రత్యేక ఆసక్తితో వాలీబాల్ పోటీలలో పాల్గొని మంచి బహుమతుల సైతం తాను సాధించానని ప్రభుత్వ విప్ తెలిపారు. యువత కబడ్డీ కోకో వాలీబాల్ మొదలగు అన్ని రకాల క్రీడల వైపు ఆసక్తి చూపించాలని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రతినిత్యం శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేసే పోలీసు అధికారులకు సిబ్బందికి ఇటువంటి క్రీడా పోటీలు ఒత్తిడిని తగ్గిస్తాయని అన్నారు. క్రీడా పోటీల నిర్వహణ వల్ల పోలీసు అధికారులు



రెట్టించిన ఉత్సాహంతో విధులు నిర్వహిస్తారని అన్నారు. గ్రామీణ ప్రజలకు సైతం ఏదైనా ఇబ్బందులు ఎదురైతే డయల్ 100 కు ఫోన్ చేస్తే సహాయం అందుతుందనే విశ్వాసం కలిగిందని అన్నారు. పోలీసు శాఖలో సాంకేతికత వినియోగం పెంచేందుకు ఎస్పీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం మరింత మెరుగ్గా అమలు చేయాలని అన్నారు.యువత సన్మార్గంలో నడిచేందుకు గంజాయి రహిత రాష్ట్రంగా తయారు చేసేందుకు ముఖ్యమంత్రి రూపొందించిన ప్రణాళికలను పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని ద్రవ్యాలకు బానిసలుగా మారిన వ్యక్తులను కౌన్సెలింగ్ ద్వారా మార్చే దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. 2036 ఒలంపిక్స్ నాటికి తెలంగాణ నుంచి పతకాలు సాధించాలని ఎలక్షన్ కు ప్రభుత్వం క్రీడా జ్యోతి పాలసీ తయారు చేస్తుందని అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. నిఘా నేత్రాల ద్వారా శాంతి భద్రతలను మరింత పటిష్టం చేస్తున్నామని, వేములవాడ పట్టణంలో కూడా నిఘా నేత్రాలను అవసరమైన మేర ఏర్పాటు చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంమాట్లాడుతూ, సిరిసిల్ల జిల్లాలో ఎస్పీ మంచి కార్యక్రమం తీసుకున్నారని, కుటుంబాలకు దూరంగా ఒత్తిడితో పని చేసే పోలీసు శాఖ అధికారులకు సిబ్బందికి క్రీడా పోటీలు నిర్వహించారని అన్నారు.మనమంతా ప్రశాంతంగా జీవించాలంటే పోలీసు శాఖ పనితీరు చాలా ముఖ్యమని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో పోలీసు శాఖ పనితీరుపై ఎటువంటి ఉత్తర లేకుండా పూర్తి స్వేచ్ఛ కల్పించామని అన్నారు. ఎస్పీ అఖిల్ మహజాన్ మాట్లాడుతూ, పోలీస్ శాఖ క్రీడా పోటీలు నిర్వహించడం చాలా మంచి కార్యక్రమం అని, 24 గంటలపాటు అలర్ట్ గా ఉంటూ విధులు నిర్వహించే పోలీస్ శాఖకు ఇటువంటి క్రీడా పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. క్రీడా పోటీలలో పాల్గొన్న సిబ్బంది అందరికీ ప్రత్యేక అభినందనలు అందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇటీవలే మానేరు వాగులో ఆత్మహత్యకు ప్రయత్నించిన వృద్ధురాలిని కాపాడిన కానిస్టేబుల్ ను అభినందిస్తూ సర్టిఫికెట్, క్యాష్ ప్రైజ్ అందజేసి సత్కరించారు.అనంతరం క్రీడా పోటీలలో విజేతలకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ , జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లతో కలసి ట్రోఫీ లు అందజేశారు.ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపా రెడ్డి, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ లు,ఆర్.ఐ లు,ఎస్.ఐ లు,ఆర్.ఎస్.ఐ లు,పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్

## - కలెక్టర్ పమేలా సత్పతి - జిల్లాకు చేరిన సీఎం కప్ క్రీడాజ్యోతి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నవంబర్ లో సీఎం కప్ పోటీలు నిర్వహిస్తుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సీఎం కప్ క్రీడోత్సవాలకు సంబంధించిన క్రీడాజ్యోతి ర్యాలీ బుధవారం కరీంనగర్ కు చేరుకుంది. క్రీడాజ్యోతి ర్యాలీకి కమాన్ వద్ద కలెక్టర్, %ంబఝు% చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి,సీపీ అభిషేక్ మహంతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, నగరపాలిక కమిషనర్ చాహత్ భాజ్ పేయి, యువజన క్రీడల అధికారి శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ర్యాలీ యొక్క ముఖ్య ఉద్దేశం త్వరలో జరగబోయే సీఎం కప్ గురించి ప్రజల్లో







అవగాహన కల్పించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ క్రీడాకారులు పాల్గొనే విధంగా అవగాహన కల్పించడమే ముఖ్య లక్షమని అన్నారు.అలుగునూర్ చౌరస్తా నుండి కమాన్ మీదుగా అంబేద్కర్ స్టేడియం వరకు అట్టహాసంగా సుమారు 800 మంది క్రీడా భిమానులతో క్రీడాజ్యోతి ర్యాలీ కమాన్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో డీ ఆర్ఓ పవన్ కుమార్, ఆర్డీఓ మహేశ్వర్, జిల్లా ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పర్వతారోహణ చేసిన విద్యార్థులు

**సూర్య,రాయికల్**

ఈ నెల 7 న హిమాచల్ ప్రదేశ్ మనాలిలోని 14600 ఫీట్స్ (4250 మీటర్స్ ) కలిగిన మౌంట్ పర్వతాన్ని అంతర్జాతీయ పర్వతారోహకులు, గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత ఫిజికల్ డైరెక్టర్ లెంకల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కోచ్ దీకొండ శివరామకృష్ణ శ్రీ చైతన్య డిఫెన్స్ %డ% స్పోర్ట్స్ అకాడమి ఆలూరు గ్రామానికి చెందిన అన్నా చెల్లెలు లక్కం మనిరాజ్,రిషిత లు చిన్న వయసులోనే పర్వతారోహన చేసి ప్రశంసలు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సే నో టు డ్రగ్స్ అనే నినాదాన్ని ఎంతో మంది యువతకు మాదక ద్రవ్యాల పట్ల అవగాహన అందించే దిశగా పర్వతాన్ని అధిరోహించడం జరిగిందని,ఇట్టి పర్వతా రోహనకు దాదాపు 12 గంటల సమయం పట్టిందని శిక్షకులు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత ముద్దసాని రమేష్ రెడ్డి, ఆలూరు గ్రామ మాజీ సర్పంచ్ రాంరెడ్డి, భాస్కర్ రావు,మాజీ ఎంపీటీసీ సురేందర్ రెడ్డి విద్యార్థులను అభినందించారు.



# అమ్మవారి ఆశీస్సులతో సంతోషంగా ఉండాలి

## - ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**సూర్య రుద్రంగి**



అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. దేవి శరన్నవరాత్రోత్సవల్లో భాగంగా బుధవారం రుద్రంగి మండల కేంద్రంలోని ఇందిరాచౌక్ లోని యంగ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అతి శ్రీనివాస్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ఈ సంవత్సరం కూడా సంమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని మనస్పూర్తిగా దుర్గామాతను కోరుకున్నార న్నారు. అనంతరం యూత్ ఆధ్వర్యలో దుర్గామాత మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, నాయకులు తర్రె మనోహర్, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, చెలుకల తిరుపతి, ఎర్రం గంగనర్సయ్య, గండి నారాయణ, కొమిరె శంకర్, పల్లి గంగాధర్, మాడిశెట్టి అభిలాష్, పిడుగు లచ్చిరెడ్డి, గుగ్గిళ్ళ వెంకటేశం, సూర యాదయ్య, శ్రీనివాస్, గంగరాజం, దాసు తోపాటు వినాయక మండపాల నిర్వాహకులు, గ్రామస్తులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.





# మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**సూర్య కోరుట్ల రూరల్**

మండల పరిషత్ కోరుట్ల కార్యాలయంలో మహిళల ఆరాధ్య దైవమైన బతుకమ్మనుఎంపీడీఓ వి రామకృష్ణ ఆధ్వర్యంలో కార్యాలయ మహిళా సిబ్బంది కార్యా కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన బతుకమ్మ నుకొలుస్తూ ఆటపాటలతోసంబురాల ను ఘనంగా నిర్వహించు కొన్నారు. ఇట్టి కార్యక్రమం లో ఎంపీవో కృపాకర్, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది, మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రి వేడుకలలో వేణుగానామృతం.

## - ప్రముఖ అంతర్జాతీయ కళాకారిణి జయప్రద రామ్మూర్తిచే కచేరి.

**సూర్య రాజన్న సిరిసిల్ల.**

దేవి శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా ప్రముఖ అంతర్జాతీయ కళాకారిణి జయప్రద రామ్మూర్తి తన వేణు గానామృతం చేత భక్తులను మంత్రముగ్ధులను చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన జయప్రద రామ్మూర్తి వేణు గాన ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా తంగళ్లపల్లి మండలంలోని మార్కండేయ దేవాలయంలో దుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గ దేవి మండపంలో నవరాత్రి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పలు జాతీయ,అంతర్జాతీయ అవార్డులు అందుకున్న జయప్రద రామ్మూర్తి చేత వేణుగాన ప్రదర్శన నిర్వహించారు. జయప్రద రామ్మూర్తి పలు జాతీయ అంతర్జాతీయ వేదికలపై వేణుగాన కచేరీలు నిర్వహించారు. వకీల్ సాబ్,బాహుబలి,ఓం నమో వెంకటేశాయ లాంటి సినిమాలలో వేణు గాన సంగీతాన్ని అందించారు. మైసూర్ పీఠం, కంచి దత్త పీఠం, శ్రీశైలం,యాదాద్రి దేవస్థానాలకు ఆస్థాన విదూషిమనిగా వ్యవహరిస్తున్నారు. ఆల్ ఇండియా రేడియోలో టాప్ గ్రేడ్ కళాకారునిగా ఉన్న జయప్రద రామ్మూర్తి వేణువు నుండి పలకించిన భక్తి స్వరాలు విన్న భక్తజన సందోహం అధ్యంతం పులకరించిపోయారు. దుర్గామాత సేవాసమితి నిర్వాహకులైన జక్కని నాగరాజు మిత్ర బృందం ఏర్పాటుచేసిన ఈ సంగీత విభావరిలో కంచి ఆస్థాన విధ్వంసులు పిఎస్ మల్లికార్జున్ మృదంగ సహకారం అందించారు.



# పువ్వుల కోసం మార్కెట్లు కిటకిట

**సూర్య, హుజురాబాద్**

తెలంగాణ సాంప్రదాయ పండుగైన బతుకమ్మ పండుగ కోసం కావలసిన పూల కొనుగోలుకై మహిళలు రావడంతో మార్కెట్లు కిటకిటలాడుతున్నాయి. గురువారం బతుకమ్మ పండుగ చివరి రోజైన సద్దుల బతుకమ్మ పండుగ కావడం సద్దుల బతుకమ్మ రోజున పెద్ద బతుకమ్మలు ప్రతి ఒక్కరు పేర్చే ఆచారం ఉండడంతో మహిళలు బతుకమ్మలకు కావలసిన పూల కొనుగోలుకై హుజురాబాద్ పట్టణంలోని బస్టాండ్, సూపర్ బజార్ రోడ్లలో భారీ సంఖ్యలో వచ్చారు. బతుకమ్మ పేర్చడం కోసం బంతి పూలు, గునుగు పూలు, తంగేడు పువ్వు, గుమ్మడి పువ్వు, ఎర్ర



పూలు, చేమంతి పూలు, పట్టుకుచ్చులు కొనుగోలు చేస్తున్నారు. భారీ సంఖ్యలో మహిళలు, ప్రజలు పువ్వుల కొనుగోలు కోసం రావడంతో పువ్వుల ధరలను వ్యాపారులు అమాంతం పెంచేశారు. అయినప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో మహిళలు పువ్వులను కొనుగోలు



చేస్తున్నారు. ప్రజలు కొనుగోలు కోసం భారీ సంఖ్యలో రావడంతో హుజురాబాద్ టౌన్ సిఐ తిరుమల్ గౌడ్ ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

# మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయద్దు..

## - సైకాలజిస్ట్ పున్నంచందర్ పిలుపు

**సూర్య సిరిసిల్ల టౌన్**

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్, తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్,హెల్పింగ్ హార్ట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని గణేష్ నగర్ లో కార్మికులకు ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నంచందర్ మనో వికాస కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మానసిక సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని అన్నారు.ప్రపంచ ఆరోగ్య సంస్థ, మెంటల్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యక్తుల మానసిక ఆరోగ్యం అనే అంశంపై ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వ,స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యంపై కౌన్సిలింగ్,అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపు ఇవ్వడం జరిగిందని తెలిపారు.అందులో భాగంగానే పవర్ లూం



కార్మికులకు కౌన్సిలింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశామని,వృత్తి పరమైన పరిస్థితులు మానసిక ఆరోగ్యంపై ఏటువంటి ప్రభావం చూపిస్తాయో,వాటి నుండి బయటపడే మార్గాలను,విస్తృత అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.ముఖ్యంగా నిద్ర లేమి,ఎక్కువగా బాధపడటం,దీర్ఘకాలిక మానసిక ఒత్తిడి,ప్రతికూల ఆలోచనలు వ్యక్తిని మానసిక సమస్యల వైపు నెట్టేస్తాయని అన్నారు.అలవాట్లు మానసిక,శారీరక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపిస్తాయని మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని కార్మికులకు సూచించారు.మద్యపానం,ధూమ పానం,తంబాకు అతిగా సెల్ ఫోన్ వాడకం మానుకోవాలని సూచించారు.మైండ్ కేర్ అండ్ కౌన్సిలింగ్ సెంటర్ గత 15 సంవత్సరాలుగా కార్మికుల మానసిక ఆరోగ్యంపై అనేక కౌన్సిలింగ్ లు ఏర్పాటు చేసి మానసిక,శారీరక ఆరోగ్యానికి తోడ్పాటు నిస్తున్నదని అన్నారు.మానసిక సమస్యలను ఎదుర్కొంటున్న వారు మైండ్ కేర్ సెంటర్ ను సంప్రదిస్తే కౌన్సిలింగ్ ద్వారా చికిత్స అందిస్తామని తెలిపారు.కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ ద్వారా మద్యం మానుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ లు ఆలువాల ఈశ్వర్, దర్పల్లి శ్రీనివాస్,మైండ్ కేర్ సెంటర్ సిబ్బంది వేముల అన్నపూర్ణ,రాపెల్లి లత,బూర శ్రీమతి, కొండ ఉమ,కార్మికులు పాల్గొన్నారు.

# విద్యా రంగంలో ఆశాస్త్రీయ మార్పులు సరికాదు

## - డి .టి. ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. లింగారెడ్డి

**సూర్య కరీంనగర్ టౌన్**

కరీంనగర్ లో బుధవారం భవన్లో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ (టిసెక్) కరీంనగర్ ఆధ్వర్యంలో తెలంగాణ విద్యారంగం -సమస్యలు- సవాళ్లు - కర్తవ్యాలు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగినది .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలం గాణ విద్యాప రిరక్షణ కమిటీ (టీసెక్)రాష్ట్ర బాధ్యులు,డిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి మాట్లా డుతూ విద్యారంగంలో భాగస్వామ్యులైన ఉపాధ్యా యులు ,అధ్యాపకులు ,మేధా వులు ,వివిధ సంఘాల నుండి అభిప్రా యాలు తెలుసు కోకుం డానే ఇటీవల ప్రభుత్వం మూడవ తరగతి వరకు అంగన్వాడీ కేంద్రాల్లో విలీనం చేసి విద్యాబోధన సాగించాలని ప్రభుత్వ ప్రణాళికను వెల్లడించింది .అదే విధంగా మన రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విధానాన్ని రద్దు చేసి 10o2 పాఠశాలలో కొనసాగించే విధంగా నూతన జాతీయ విద్యావిధానాన్ని మన రాష్ట్రంలో 5o3o3o4 విధానంలో అమలు చేయాలని ,మండలానికో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, నియోజక వర్గానికి ఒక ఇంటర్నేషనల్ పాఠశాల అదేవిధంగా రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాల యాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకుండా ఖాళీలను నింప కుండా నిధులు కేటాయిం చకుండా కొత్త కోర్సులు ప్రారంభించ కుండా కేవలం ఒకే ఒక స్కిల్ యూనివర్సిటీ స్థాపించి యువ విద్యార్థులను నైపు ణ్యావంతులుగా తయారు చేయుటకు ప్రభుత్వం తన చర్యలు ప్రారంభించిందని కానీ విద్యా రంగంలో అశా స్త్రీయ మైన మార్పులు చేపట్టడాన్ని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ తీవ్రంగా వ్యతిరేకి స్తున్నదని , కావున ప్రభుత్వం ఇప్పటికైనా ఉపాధ్యా యులు అధ్యాపకులు మేధావులతో చర్చించిన తర్వాతనే విద్యారంగ మార్పులకు శ్రీకారం చుట్టాలని డిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర బాధ్యులు టీ లింగారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వైద్యుల రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రధాన స్రవంతి లో గల ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపా యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన అల్పా హారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించి బోధనేతర పనులు తగ్గించడం ద్వారా నాణ్యమైన విద్య అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ద్వితీయ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు యం. రఘుశంకర్ రెడ్డి గారు మాట్లాడుతూ పూర్తిస్థాయి మండల విద్యాధికారులను నియమి ంచకుండా కేవలం ప్రధా నోపాధ్యాయులకు పూర్తిస్థాయి అదనపు బాధ్యత తో కొనసాగించడం వాంఛనీయం కాదని అదేవిధంగా కొత్తగా ఏర్పడిన జిల్లాలకు జిల్లా విద్యాధికారుల పోస్టులను,నియోజకవర్గానికి ఒక డిప్యూటీ డిఇఓ పోస్టును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.టి పి టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మాడుగుల రాములు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం ద్వారా కేంద్ర ప్రభుత్వం మతవాద భావనలను, కులాల అంతరాలను పెంచే విధంగా పాఠ్యప్రణాళికలో చేర్చుతున్నారని అందు వల్లనే నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తున్నామని. కావున నూతన జాతీయ విద్యా విధా నాన్ని రాష్ట్రంలో కూడా అమలు చేయవద్దని, ఉపాధ్యాయుల సర్దుబాటు పేర అశాస్త్రమైన జీవో 25 ను దొడ్డి దారిన అమలు చేయవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.ఎల్లయ్య మాట్లా డుతూ విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం తన బడ్జెట్లో 10 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం 20 శాతం నిధులను కేటాయించాలని కోరారు. ఈ సమావేశానికి డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి అధ్యక్షత వహించగా టి పి టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు సహ-అధ్యక్షులుగా వ్యవహరించగా డిటిఎఫ్ ,టిపిటిఎఫ్ సంఘాల రాష్ట్ర /జిల్లా/మ ండలాల బాధ్యులు ,కె.నారాయణ రెడ్డి, కే చంద్రమౌళి, కోల రాజ మల్లు, కె కిషన్ రావు , తూముల తిరుపతి, ఆర్ చంద్రశేఖర్ ,ఏ.సంతోష్ రెడ్డి, ఏ దామోదర్, చకినాల రామ్మోహన్, కె.కిషన్ రెడ్డి టి.తిరుపతి ,పెరుగు నర్సయ్య,వి.రాంకిరణ్ ,ఏ. రాజేశ్వర రావు, చకినాల దేవేందర్, వి.పెంట య్య , డిటి ఎఫ్ మండలాల బాధ్యులు,వివిధ సంఘాల బాధ్యు లు జి రవీందర్ రెడ్డి టీజీపీఏ అధ్యక్షులు, డాక్టర్ వంగల శ్రీనివాస్ లెక్చరర్ డిగ్రీ కళాశాల, కే సంజీవ్ ట్రైటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాజకీయ పార్టీల ప్రతినిధులు సిపిఐ నుండి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి టీ సమ్మయ్య గారు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం వాసుదేవ రెడ్డి, బహుజన సమాజ్ పార్టీ జిల్లా ప్రతినిధి సుతారి లక్ష్మణ్ గారు, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు పాల్గొని మాట్లాడుతూ నాణ్యమైన విద్య ప్రజల హక్కు అని కావున ఉపాధ్యాయులు ప్రభుత్వ విద్యా విధానం గురించి ప్రజలకు తెలియపరచి చైతన్య వంతులు చేసి ప్రజా ఉద్యమాల ద్వార ప్రభుత్వాలపై ఒత్తిడి చేసి విద్యారంగాన్ని మార్చుకోవాలని సూచించారు .

# రాంలీలా వేడుకలకు తరలి రావాలి

## - రాంలీలా ఉత్సవ కమిటీ

**సూర్య తిమ్మాపూర్**

తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎల్ ఎం డి కాలనీలో గల రాంలీలా మైదానంలో నిర్వహించనున్న దసరా వేడుకలకు ప్రజలు భారీగా తరలి రావాలని రాంలీలా ఉత్సవ కమిటీ ఒక ప్రకటనలో కోరింది. ఈ ఏడాది దసరా వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశామని, ఈ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీ తెలిపింది. రావణాసురుని వధ, అనంతరం నిర్వహించే క్రాకర్స్ షో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని కమిటీ పేర్కొంది.దసరా వేడుకలు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతాయని, ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూ ర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, అతిథులుగా జిల్లా కలెక్టర్ పమీలా సత్పతి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయి, లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్ హాజరవుతారని ఉత్సవ కమిటీ తెలిపింది. ఈ వేడుకలను తిలకించడా నికి మానకొండూర్ నియోజక వర్గంతోపాటు కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలి వస్తుంటారని, ఈ సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నామని, కరీంనగర్ వైపు నుంచి వేడుకలకు వచ్చే వాహనాలు వెంకటేశ్వరస్వామి దేవాలయం వెనుక వైపున, అలాగే తిమ్మాపూర్ వైపు నుంచి వచ్చే వాహనాలకు ఎల్.ఎం.డి కాలనీలోని శ్రీ తాపాళ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద పార్కింగ్ ఏర్పాటు చేశామని ఉత్సవ కమిటీ వివరించింది. దసరా వేడుకలను వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి, ముఖ్యంగా మానకొండూర్ నియోజకవర్గం నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని రాంలీలా ఉత్సవ కమిటీ కోరింది.



# మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో వెలిచాల రాజేందర్ రావు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

ప్రజా సమస్యల పరిష్కారానికి బుధవారం హైదరాబాద్ లోని గాంధీభవన్లో నిర్వహించిన మంత్రుల ముఖాముఖి కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు వివిధ సమస్యలపై వినతి పత్రాలు మంత్రికి అందజేశారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగతంగా మరింత బలోపేతం చేసే అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్ తో చర్చించానని పేర్కొన్నారు. రాబోయే మున్సిపల్ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసేలా చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ప్రతి బుధ, శుక్రవారం గాంధీభవన్లో మంత్రులు అందుబాటులో ఉంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు కార్యకర్తలు, ప్రజల నుంచి విజ్ఞాపన పత్రాలు స్వీకరించారని వెలిచాల రాజేందర్ రావు తెలిపారు. రాబోయే రోజుల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సహకారంతో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.

# హైమాస్ లైట్లు ప్రారంభం

## - కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హమీద్

**సూర్య గంభీరావుపేట**

గంభీరావుపేట మండల కేం ద్రంలోని న్యూ హనుమాన్ నగర్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ హమీద్ నాయకులతో కలిసి నూతనంగా ఏర్పాటుచేసిన హైమస్ లైట్లను బుధవారం ప్రారంభించారు. ఎస్ డిఎఫ్ నిధులతో మండలానికి 25 హైమస్ లైట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పాపగారి రాజు గౌడ్ ఏఎంసి వైస్ చైర్మన్ పాతూరి అంజిరెడ్డి డైరెక్టర్ ఎడబోయిన ప్రభాకర్ మండల మాజీ వైస్ చైర్మన్ జంగ కాశి రాములు సోషల్ మీడియా కన్వీనర్ గౌరీ శంకర్ , సీనియర్ నాయకులు జంగం రాజు పెద్దివేని మల్లయ్య, బంగ్లా రాజు గౌడ్ అక్క పెల్లి బాలయ్య లక్కం నాంపల్లి,తదితరులు పాల్గొన్నారు.

# శక్తి శాలి భారత్ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ ధ్యేయం

## - ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ వ్యవస్థా ప్రముఖ్ తిరుమల్ జీ

సూర్య జగిత్యాల టౌన్

శక్తి శాలి భారత్ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ ధ్యేయమని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తెలంగాణ ప్రాంత సహ వ్యవస్థా ప్రముఖ గంటా తిరుమల్ జీ అన్నారు. ఆర్ఎస్ఎస్ జగిత్యాల జిల్లా విజయ దశమి ఉత్సవం బుధవారం పట్టణంలోని గీతా విద్యాలయం మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగా విచ్చేసిన తిరుమల్ జి మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక సంఘం ప్రారంభించి ఈ విజయదశమి ఉత్సవంతో 100 సంవత్సరములు పూర్తి అయిందన్నారు. వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ పునర్నిర్మాణమే ధ్యేయంగా ఆర్ఎస్ఎస్ ను డాక్టర్ హెడ్గేవార్ స్థాపించారని తెలిపారు. విజయదశమి ఉత్సవం రోజు శక్తి ఉపాసన ముఖ్య ఉద్దేశంగా ఉంటుందన్నారు. వ్యక్తులు కాని, సమాజం కానీ,



దేశం గానీ శక్తివంతంగా ఉంటేనే మన మాట చెల్లుబాటు అవుతుందన్నారు. శక్తివంతమైన దేశ నిర్మాణం కోసం ప్రజలు కూడా తమ ఆలోచన విధానాన్ని మార్పు చేసుకోవాలని సూచించారు. చుట్టూ శత్రు దేశాలు ఉన్నప్పటికీ అతి చిన్న దేశమైన ఇజ్రాయిల్ అత్యంత శక్తివంతమైన తీవ్రవాదులను మట్టి కనిపిస్తున్న తీరు ప్రతి ఒక్కరికి ఆదర్శంగా ఉందన్నారు. ఇజ్రాయిల్ లోని ప్రతి వ్యక్తి ఒక సైనికుడేనని, ప్రతి వ్యక్తి ఒక దేశభక్తుడేనని అలాంటి దేశానికి ఎంతటి ఆపద వచ్చిన సులభంగా ఎదుర్కొంటుందన్నారు. దేశంలోని ప్రజల్లో ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ దేశానికి ఆపద వస్తే ఒకే తాటిపై నిలబడే సంస్కృతిని అలవర్చుకోవాలని సూచించారు. అంతకుముందు స్వయం సేవకులు ఈ గీత విద్యాలయం నుండి బయలుదేరి పట్టణంలోని ప్రధాన వీధుల గండ పథ సంచలనం (రూట్ మార్చ్) భారతీయ వాయిద్యాలతో నిర్వహించిన ఈ పథసంచరం పట్టణ వాసులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ సంఘచాలక్ డాక్టర్ భీమనాత్ని శంకర్, జిల్లా సంఘచాలక్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసరెడ్డి, నగర సంఘ చాలక్, జీడిగే పురుషోత్తం జిల్లాలోని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## ఎం ఆర్ పి ఎస్ నిరసనకు తరలి వెళ్ళిన నాయకులు

సూర్య ఎండపల్లి



తెలంగాణ వ్యాప్తంగా ఎం.ఆర్.పి ఎస్.అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ లేకుండానే 11 వేల టీచర్ పోస్టుల భర్తీ చేస్తోందని చెప్పారు. దీన్ని నిరసిస్తూ అన్ని జిల్లా కేంద్రాల్లో అంబేద్కర్ విగ్రహాల నుంచి కలెక్టరేట్ల వరకు ర్యాలీ నిర్వహించి ధర్నాలు చేపట్టాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో కలెక్టర్లకు తమ వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలోఉమ్మడి వెల్గటూర్ మండలం చెన్న కుమారస్వామి అధ్యక్షులు జిల్లా ప్రధాన కార్యదర్శి మోకెనపల్లి సతీష్, జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, ధర్మపురి ఇంచార్జి చిర్ర లక్ష్మణ్, మామిడిపల్లి సంతోష్, బెజ్జంకి సతీష్, ఎం ఎస్ పి జిల్లా అధ్యక్షులు దుమల గంగారాం తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కాలనీలో దుర్గ నవరాత్రి ఉత్సవాలు

- మహా అన్నదానం

సూర్య-కోరుట్ల



కోరుట్ల పట్టణంలోని 20వ వార్డు, బీసీ కాలనీలో సంక్షేమ యువజన సంఘం అధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో బాగుండాలని మహా అన్నప్రసాద దాతగా దువ్వ సత్యనా రాయణ-గంగలక్ష్మిలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో సంఘ గౌరవఅధ్యక్షులు బింగి సంతోష్, అధ్యక్షులు కటుకం రవి, ఉపాధ్యక్షులు బింగి మహేష్,రుద్ర స్వామి, గొడ్డుబర్ల రాజేంద్రప్రసాద్,చిలుక ఆనందం, యువత అధ్యక్షులు వాసలసంతోష్,ఉపాధ్యక్షులు రాపెల్లి అన్వేష్, ప్రధాన కార్యదర్శి గడ్డం సాయికృష్ణ, సహాయ కార్యదర్శిలు బింగి ప్రవీణ్, కటుకంసాయితేజ,కోశాధికారి గన్నేరువరం ప్రవీణ్ గంగాధరి రాజేష్, రుద్ర నరేష్, సాడిగె మహేష్,మిట్టపల్లి శేఖర్, బాసమాధవ్, శ్రవణ్, ఉదయ్, సాయి సుందర్,నాగార్జున సాయిమనిశ్,వికాస్, శ్రీకాంత్, ఆకాష్, వివేక్, రాజకీయ నాయకులు, హాజరయ్యారు.పట్టణ వాసులు కాలనీ భక్తులు వేల సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అలరించిన దాండియా ఆటలు

సూర్య మల్లాపూర్



ముందస్తు బతుకమ్మ వేడుకల్లో భాగంగా మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో బ్రదర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దాండియా, బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని పండుగా వాతావరణంలో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. దాండియా ఆట గ్రామస్థులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయికుమార్, నేరెళ్ళ మోహన్ రెడ్డి, కట్కం నర్సరెడ్డి, శేఖర్, దీకొండ శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద మహిళలకు చీరలు పంపిణి చేసిన కోలకాని సత్యం

సూర్య కొడిమ్యాల



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో బతుకమ్మ పండగ సందర్భంగ నిరుపేద కుటుంబాలకు చెందిన (30) ముప్పై మంది మహిళలకు కోలకాని పద్మ-సత్యం తన స్వంత డబ్బులతో చీరలు పంపిణి చేశారు. గ్రామంలోని మహిళలలు మాట్లాడుతూ నిరుపేదలకు చీరలు పంపిణి చేసిన కోలకాని పద్మ సత్యంలను అభినందించారు.గత కొన్ని రోజుల నుండి గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు అని గుర్తు చేశారు.భవిష్యత్‌లో గ్రామంలో మరిన్ని సేవ కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ సందర్భంగ కోలకాని పద్మ సత్యం మాట్లాడుతూ నిరుపేద మహిళలకు బతుకమ్మ పండగ సందర్భంగా చీరలు పంపిణి చేశామని గత కొన్ని రోజుల నుండి గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు.భవిష్యత్‌లో గ్రామ ప్రజల సహకారతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని దీనికి గ్రామంలోని ప్రతి ఒక్కరి సహకారం ఉండాలని గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ భీమరాజు రవీందర్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మణ్,(30) ముప్పై మంది మహిళలు పాల్గొన్నారు.

## నవ దుర్గా మాత సన్నిధిలో ఘనంగా సరస్వతీ పూజ

సూర్య జగిత్యాల



జగిత్యాల జిల్లా కేంద్రంలోని నవదుర్గా పీఠ క్షేత్రంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బుదవారం మహా పూజ, మంత్ర పుష్పం, ప్రసాద వితరణ మూల నక్షత్రము సందర్భంగా అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు సరస్వతీ పూజ అక్షరాభ్యాసం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి శాకాంబరీ అలంకరణ నవ హారతులు జీవన లక్ష్మి బతుకమ్మ పండుగ సంబరాలు చండి హవనం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేద బ్రాహ్మణుల మంత్రోత్సరణల మద్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కార్యనిర్వాహక సభ్యులు, మహిళలు, భక్తులు, పాల్గొన్నారు.

## బతుకమ్మ ఏర్పాట్లు పూర్తి

సూర్య వీణవంక

వీణవంకలో నేడు జరుగు సద్దుల బతు కమ్మ పండుగ సందర్భంగా బుధవారం తాజా, మాజీ సర్పంచ్ నీల కుమార్ స్వామి దగ్గరుండి అన్ని పనులను పూర్తి చేయించారు. ప్రత్యేకంగా సమ్మక్క గద్దెల దగ్గర డెకరేషన్, లైట్స్, క్లీనింగ్ పనులను చక్కగా నిర్వహించడమే కాకుండా, ఎస్సి కాలనీ వారి కోసం రామకృష్ణాపూర్ వాగు దగ్గర కూడా పూర్తి క్రమంలో క్లీనింగ్, లైటింగ్, డెకరేషన్ పనులు పూర్తి చేయించారు.

## దుర్గామాతను దర్శించుకున్న కల్వకుంట్ల

సూర్య-కోరుట్ల



కోరుట్ల పట్టణంలోని 23వ వార్డు ఏసుమని గుట్టలోని శ్రీ దుర్గమాత సేవా సమితి వారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ చిత్తరి ఆనంద్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు, మహిళలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మండల పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

సూర్య రాయికల్



రాయికల్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ సిబ్బంది,కార్యదర్శులు,మెప్మా సిబ్బంది, వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు బతుకమ్మను వివిధ పూలతో అలంకరించి,బతుకమ్మ ను పేర్చి ఆటలాడారు. బతుకమ్మ విశిష్టతను తెలిపే పాటలకు సాంప్రదాయ బద్దంగా ఆటలు ఆడారు.

ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ మహమ్మద్ అబ్దుల్ ఖయ్యాం,ఎంపీఓ సుష్మా,పి ఆర్ ఎ.ఇ ప్రసాద్,ఏపీఓ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మాన్ని కాపాడవలసిన బాధ్యత మనందరిది

సూర్య -కోరుట్ల



సనాతన ధర్మాన్ని కాపాడవలసిన బాధ్యత మనందరి పైన ఉన్నదని శ్రీ శ్రీ శ్రీ జగదీశ్వరానంద గిరి స్వామి, శ్రీశ్రీశ్రీ సద్గురు మహాదేవ్ స్వామీజీ, శ్రీశ్రీశ్రీ విశాఖ తీర్థ స్వామి జీలో పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటుకై చేపట్టిన ర్యాలీకి ముఖ్య అతిథులుగా హాజరైన స్వామీజీలు ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. హైందవ సాంప్రదాయాలు హిందూ దేవాలయాలను కాపాడడానికి నూతన ధర్మ రక్షణ బోర్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని అన్నారు . సనాతన హైందవ ధర్మం పాటించడం ప్రతి హిందువు విద్యుత్ ధర్మం అందుకే చేయి చేయి కలుపుదాం తరాల జాడ్యాన్నితర్మదం అన్యాక్రాంతానికి ఎన్నో అణచివేతలు ఎదుర్కొంటున్న మన సనాతన హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాల్సిన కర్తవ్యం మన అందరిపై ఉందన్నారు.ఈ బోర్డ్ ఏర్పాటు దేశానికి అత్యవసరమని అన్నారు. దేశంలో హిందూ దేవాలయకు సంబంధించిన భూములను కాపాడుకోవాలని అన్నారు. అలాగే హిందూ దేవాలయ లలో భక్తుల నుండి వచ్చిన డబ్బులను దేవాలయాల అభివృద్ధి కోసమే ప్రభుత్వాలు వెచ్చించాలని వారు కోరారు. భక్తులు అందజేసిన ఈ నిధులు రాజకీయ నాయకులు పక్కదారి పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇట్టినిధులు హిందూ బంధువులు కాపాడుకోవాల్సినదిగ వారు కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ సనాతన ధర్మరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని దీని కోసం జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రులకు కూడా వినతి పత్రాన్ని సమర్పించుదామని తెలిపారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నుండి భారీ ర్యాలీగా వెళ్లి ఆర్డిఓ కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించి ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సనాతన ధర్మ పరిరక్షణ హిందూ ఐక్యవేదిక నాయకులు పట్టణ పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.